సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 9-5-2025 15/-



## మన భాష మన సంస్కృతి



తమకు అనుకూలంగా మాట్లాడకపోతే సుప్రీంనే బెదిరిస్తారా?



ముస్లిమ్ ఆదర్శ దినచర్య

గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 47 సంచిక: 19 హైదరాబాద్
శుక్రవారం 9 మే 2025 రూ.15-00
10 జీఖఅదహ్ 1446 హిజ్రీ


**తొలిగీటు**

ఇష్టమైంది తినండి. నచ్చిన దుస్తులు ధరించండి. అయితే మీలో పొగరుగాని, అనవసరపు వ్యయం చేసే బుద్ధిగాని దరి చేసుకోకూడదు.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**




# పుస్తక పఠనం 16

## లోపల...


| | | |
|---|---|---|
| పహల్గాం తర్వాత | ...... | 04 |
| మన భాష... మన సంస్కృతి | ...... | 05 |
| సంపన్నుల నుంచి పేదలకు సంపద పంపిణీ కావడమే సరైన పద్ధతి | ...... | 11 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 20 |
| ఇస్లామీయ ఉద్యమం భవిష్యత్తు - 1 | ...... | 21 |
| చరితార్థులు–2 : మౌలానా హిఫ్జుర్రహ్మాన్ సియోహార్వి | ...... | 23 |
| అనుకూలంగా మాట్లాడకపోతే సుప్రీంనే బెదిరిస్తారా? | ...... | 24 |
| తాగూత్ వ్యవస్థపై తిరగబడిన టీనేజీ కుర్రాడు–1 | ...... | 26 |
| ముస్లిం ఆదర్శ దినచర్య | ...... | 29 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| సత్సంకల్పంతోనే సాఫల్యం | ...... | 34 |


**ఇంకెప్పుడు సారూ!?**




ఉగ్రవాద దాడి మీద
ఉరిమినాడు మోడీ
ఛెప్పనించు ఛాతీతో
చేస్తడంట పెద్ద దాడి!
భూమ్మీద ఎక్కడున్న
మట్టుబెడత అన్నడు
బీహారులో బిజీగుండె
ఖాళీగ ఉన్నదెన్నడు!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఆలోచన

## పహల్గాం తర్వాత

**పహల్గాం దాడి** తర్వాత వెనువెంటనే ఛత్తీస్ గఢ్ బీజేపీ చేసిన ట్వీటు... రాజకీయాలు ఎంతగా దిగజారాయో చెప్ప డానికి ఒక ఉదాహరణ. పహల్గాం దాడుల్లో భర్తను కోల్పోయి, భర్త మృతదేహం పక్కన కూలబడిన భార్య ఫోటో చాలా మంది చూసే ఉంటారు. హృదయవిదారకమైన విషాద దృశ్యం. ఆ ఫోటోకు గిబిలీ కార్టూన్ తయారు చేసి, కులం అడగలేదు, మతం అడిగారంటూ క్యాప్షన్ పెట్టి ఛత్తీస్ గఢ్ బీజేపీ ట్వీట్ చేసింది. ఈ ట్వీటులో మతతత్వం, కులతత్వం రెండు వికృతంగా కనిపిస్తున్నాయన్నది ప్రత్యేకంగా చెప్ప నవసరం లేదు.

అదే ఛత్తీస్ గఢ్ నుంచి మరో వార్త వచ్చింది. ఈ వార్త కూడా బీజేపీకి సంబంధించిందే. భారతీయ జనతా యువ మోర్చ సభ్యుడు అరవింద్ అగర్వాల్ ఫేస్‌బుక్‌లో ఒక పోస్టు పెట్టి కశ్మీర్ వ్యాపారి నజాకత్ అలీ ఎలా ప్రాణాలకు తెగించి తమ కుటుంబాన్ని కాపాడాడో చెప్పడమే కాదు, నజాకత్ భాయ్ జన్మజన్మలకు మీ రుణం తీర్చుకోలేమని కృతజ్ఞతలు చెప్పాడు.

మరో వార్త బెంగాల్‌కు సంబంధించింది. అక్కడి బీజేపీ నాయకుడు సుధేంద్రు అధికారి బాధిత కుటుంబాన్ని కలిసి హిందువులుకాబట్టే చంపేశారని చెప్పండని అరుస్తున్న వీడియో వచ్చింది. బెంగాల్లో ఇద్దరు కశ్మీరీ అనుమానితులున్నా రంటూ కూడా ట్వీటు చేశాడు. ఆ ఇద్దరు జియో కంపెనీకి చెందిన ఇంజనీర్లని తర్వాత తెలిసింది. మతవర్గాల మధ్య చిచ్చుపెట్టడానికి చేయవలసిన ప్రయత్నాలన్నీ ఈ శక్తులు చేస్తూనే ఉన్నాయి. బీజేపీ నేత నిశికాంత్ దూబే తాను ముస్లిముల విశ్వాసవచనం నేర్చుకుంటున్నానని, ఎప్పుడు అవసరం పడుతుందో ఏమో అంటూ ట్వీట్ చేసాడు. ఈ ట్వీటులోని మతతత్వం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

పూణె నుంచి వచ్చిన ఇద్దరు పర్యాటకులను కాపాడడానికి ఉగ్రవాదులతో తలపడి ప్రాణాలర్పించిన ఆదిల్ హుస్సేన్ షా, అతని బంధువే నజాకత్ అలీ. శాలువాలు అమ్ముకునే సజాద్ భట్ కొండపై నుంచి ఒక కుర్రాడిని భుజాలపై మోస్తూ మైళ్ళు పరుగెత్తి ప్రాణాలు కాపాడాడు. కశ్మీరీలు చేసిన సహాయం గురించి ఒకవైపు కథనాలు వస్తున్నాయి. మరోవైపు దేశవ్యాప్తంగా పహల్గాం దాడి తర్వాత హిందూ ముస్లిం విద్వేష వార్తలు వస్తున్నాయి. ప్రాణానికి ప్రాణం అంటూ రెచ్చిపోయి, తన ఇంటి అరుగుపై తన బిడ్డతో కూర్చున్న ముస్లింను గొడ్డలితో ఆ బిడ్డ ముందే నరికిన వార్త వచ్చింది. ఈ వార్తలన్నీ ఏం చెబుతున్నాయి.

పహల్గాం తర్వాత దేశవ్యాప్తంగా హిందూ ముస్లిం చిచ్చుపెట్టడానికి ప్రయత్నిస్తున్న వారెవరైనా సరే దేశానికి మంచి చేస్తున్నారా? చెడు చేస్తున్నారా అన్నది సాధారణ ప్రజలు ఆలోచించాలి. పహల్గాం దాడి తర్వాత దేశంలోని వివిధ పట్టణాల్లో సాధారణ ముస్లిములు, చిన్నా చితక వ్యాపారులు, తోపుడుబండ్లపై వ్యాపారాలు చేసుకునేవారిని లక్ష్యంగా చేసుకుని దాడులు జరుగుతున్న వార్తలు వస్తు న్నాయి. ముస్లిములను బాయ్ కాట్ చేయాలనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ మతతత్వ శక్తులను నిరోధించే ప్రయత్నమేదీ ప్రభుత్వం చేయడం లేదు. మతతత్వ విద్వేషం పెరిగితే రాజకీయంగా లాభాలు పొందవచ్చన్న ఆలోచన ఈ నిష్క్రియాపరత్వం వెనుక ఉండవచ్చు.

పహల్గాం దాడి తర్వాత కూడా టూరిస్టులు కశ్మీరు వెళ్ళడం ఆగలేదు. అక్కడి స్థానికుల మంచితనం గురించి మాట్లాడ డమూ ఆగలేదు. ఇది ఆహ్వానించదగ్గ పరిణామం.

ఈ క్లిష్టసమయంలో దేశాన్ని ఒక్కతాటిపై నడిపించే బాధ్యత పాలకులపై ఉంది. దేశంలో మతసామరస్యాన్ని కాపాడి నప్పుడే దేశం ప్రగతిపథాన ప్రయాణిస్తుంది.

అబ్దుల్ వాహెద్




# మన భాష... మన సంస్కృతి

**కొన్ని రోజుల క్రితం** ఉర్దూ భాష గురించి సుప్రీంకోర్టు ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు మరుగునపడిన చర్చను మళ్ళీ ముందుకు తీసుకు వచ్చాయి. కవిత్వాన్ని ప్రేమించేవారు, సాహిత్యాభిమానులు ఉర్దూ భాషాభిమానులు అయినప్పటికీ ఉర్దూను ముస్లింల భాషగా ముద్రవేయడం వల్ల తలెత్తిన సమస్య ఇది. అయితే ఈ చర్చ వల్ల ఏదో జరుగుతుందని ఆశించడం కూడా అత్యాశే. గతంలో మాదిరిగానే, ఈసారి కూడా ఈ చర్చల వల్ల ఒరిగేది ఏమీ ఉండదని పలువురి అభిప్రాయం.

## అసలు కేసేమిటి?

మహారాష్ట్రలోని అకోలా జిల్లాలోని పాతుర్‌కు చెందిన మాజీ కౌన్సిలర్ వర్షాతాయి సంజయ్ బగాడే దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా న్యాయమూర్తులు ఈ వ్యాఖ్యలు చేశారు. జస్టిస్ సుధాంశు ధులియా, జస్టిస్ కె వినోద్ చంద్రన్‌ల సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ తీర్పు చెప్పింది. కేసు ఏమిటంటే, మహారాష్ట్రలోని ఒక మునిసిపాలిటీ సైన్‌బోర్డ్‌పై ఉర్దూలో రాయడాన్ని అభ్యం తరపెడుతూ ఈ పిటీషన్ దాఖలు చేశారు. ఈ పిటీషన్‌ను కోర్టు తిరస్కరించింది.

మునిసిపల్ కౌన్సిల్ సైన్ బోర్డుపై మరాఠీతో పాటు ఉర్దూ రాయ డాన్ని వర్షాతాయి అనే ఈ మాజీ కౌన్సిలర్ సవాలు చేశారు. మునిసిపల్ కౌన్సిల్ కార్యకలాపాలన్నీ మరాఠీలో మాత్రమే జరుగుతాయని, కాబట్టి సైన్‌బోర్డ్‌పై కూడా ఉర్దూ ఉండరాదని ఆమె వాదించారు. ఇద్దరు న్యాయమూర్తులు ఈ సందర్భంగా ఉర్దూ గురించి అనేక విషయాలు చెప్పారు.

కవి ఇక్బాల్ అష్రర్ రాసిన కవితను న్యాయమూర్తులు ఉటంకించారు. ఉర్దూ తన గురించి తాను చెప్పుకోవలసి వస్తే –

ఉర్దూ హై మెరా నామ్ (నా పేరు ఉర్దూ)

**క్యోం ముఝ్‌కో బనాతే హెూ తాసుబ్ కా నిషానా**
(నన్నెందుకు దురభిమానానికి గురి చేస్తున్నారు)

**మైనేతో కభీ ఖుద్‌కో ముసల్మాన్ నహీం మానా**
(నేనెప్పుడూ ముస్లింగా చెప్పుకోలేదు)

**దేఖాథా కభీ మై నే భీ ఖుషియోంకా జమానా**
(నేను కూడా సంతోషంగా గడిపిన కాలం ఉంది)

**అప్నే హీ వతన్ మే హూం మగర్ ఆజ్ అకేలీ**
(నా మాతృభూమిలోనే ఉన్నాను... కాని ఒంటరిని)

**ఉర్దూ హై మేరా నామ్ మై ఖుస్రోకి పహేలీ**
(నా పేరు ఉర్దూ ఖుస్రో ప్రహేళికను)

## భాషకు మతముందా?

భాషను మతంతో ముడిపెట్టలేమని, ఉర్దూను ముస్లింల భాషగా పరిగణించడం భారతదేశంలోని భిన్నత్వంలో ఏకత్వానికి గొడ్డలి పెట్టని, దురదృష్టకరమని న్యాయమూర్తులు వ్యాఖ్యానించడంలో ఎంతైనా ఔచిత్యముంది.

ఉర్దూను ముస్లిముల భాషగా ముద్రవేయడం ఇటీవల మరింత ఎక్కువయ్యింది. ఇదెంత వాస్తవదూరమంటే, విప్లవయోధుడు, చిరునవ్వుతో ఉరికంబమెక్కిన భగత్ సింగ్ ఉర్దూలో రాసేవారు. ఆయన ఉరి శిక్ష అమలు కావడానికి ఇరవై రోజుల ముందు 1931లో తన తమ్ముడు కుల్తార్ సింగ్‌కు రాసిన లేఖ ఉర్దూలో రాసిందే. నిజానికి ఇది వ్యక్తిగత స్థాయిలో తన తమ్ముడికి రాసిన లేఖ. అది కూడా ఆయన ఉర్దూలోనే రాశారు. ఆయనకు పంజాబీ, ఇంగ్లీషు భాషల్లో మంచి ప్రవేశముంది. సంస్కృతం నేర్చుకున్నాడు. హిందీ భాషలో గొప్పగా రాయగలడు. వీటితోపాటు ఫ్రెంచ్ భాష కూడా ఆయనకు తెలుసంటారు. ఇన్ని భాషలు తెలిసినప్పటికీ ఉర్దూనే తన చివరి లేఖ రాయడానికి ఎంచుకున్నారు. అది కూడా వ్యక్తిగతంగా తమ్మునికి రాసిన లేఖ.

జలియన్ వాలా బాగ్ మారణకాండ తర్వాత భగత్ సింగ్ ఒక నాటకాన్ని రాశారు. ఖూనీ పంజాబ్ పేరుతో రాసిన ఆ డ్రామా కూడా ఉర్దూలోనే రాశారని తెలుస్తోంది.

షాయర్ పత్రిక ముంబయి నుంచి అచ్చవుతుంది. ఉర్దూ భాషలో రాసిన ముస్లిమేతరులపై ఒక ప్రత్యేక సంచికను 2007లో అను కుంటాను ప్రచురించింది. అందులో బి.యస్.జైన్ జోహర్‌తో పాటు అమీర్ చంద్ బహార్, భగ్వాన్ దాస్ ఎజాజ్, సోహన్ రాహి, ఇంద్రామోహన్ కైఫీ దీపక్ ఖమర్, ఆశా ప్రభాత్, ఇందర్ షబ్నం, కామిని దేవి, నవ్ రోజ్ కోత్వాల్, ప్రతాప్ సింగ్ బేతాబ్, గణేష్ బిహారీ వంటి అనేక పేర్లు కనిపిస్తాయి. ఉర్దూ భాషలో రాసిన ముస్లిమేతరుల జాబితా చాలా పెద్దది. నవలా రచయితల్లో పండిత్ రతన్ నాథ్ సర్షార్ రాసిన ఫసానాయే ఆజాద్, సైరె కుహ్సార్, జామె సర్షార్ వంటి రచనలను ఎలా మరిచిపోగలం. మున్షీ జ్వాలా ప్రసాద్ బర్క్ అనేక పుస్తకాలను అనువదించారు. ఉర్దూ సాహిత్యంలో తనదైన అధ్యాయాన్ని రాసుకున్న ప్రేమ్ చంద్, నవలా రచయిత కిషన్ చందర్, ప్రముఖ కవి బ్రిజ్ నారాయణ్ చక్ బస్త్, పండిత్ చంద్ర భాన్ బ్రాహ్మణ్, ఫిరాక్ గోరఖ్ పూరి (ప్రొఫెసర్ రఘునాథ్ సహాయ్ అసలు పేరు), కువర్ రాజేందర్ సింగ్ బేడీ, మనోహర్ లాల్ కపూర్ తాలిబ్, మున్షీ నావల్ కిశోర్, గోపీనాథ్ నారంగ్, ఇప్పుడు హిందీ సినిమాల్లో ప్రముఖంగా రాస్తున్న గుల్జార్ (సంపూరన్ సింగ్ కాల్రా) – అలాగే వ్యంగ్య రచన లకు కూడా ఉర్దూ ప్రఖ్యాతి పొందింది. పండిత్ తిర్భున్ నాథ్ అజీర్ పేరు తప్పక ప్రస్తావించవలసిన పేరు. ఈ జాబితా చాలా పెద్దది. ఇందులో జగన్నాథ్ ఆజాద్ పేరు ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఎందుకంటే, పాకిస్తాన్ జాతీయగీతాన్ని రాయాలని ఆయన్ను స్వయంగా జిన్నా కోరి రాయించుకున్నాడు. కాళోజీ నారాయణ రావు గారి సోదరుడు కాళోజీ రామేశ్వరరావు గారు షాద్ పేరుతో ఉర్దూలో కవిత్వం రాసారు. తెలుగులోను మిత్రుడు పి.వి.సూర్య నారాయణ మూర్తి ఉర్దూ భాషపై ప్రేమతో పట్టు సంపాదించి, జిలానీబానో కథలను తెలుగులో అనువదించారు. మెహక్ హైదరాబాదీ కలంపేరుతో ఆయన రాస్తారు.

## ఉర్దూ జర్నలిజంలోనూ ముస్లిమేతరులు

కేవలం రచయితలు, కవులు మాత్రమే కాదు అవధ్ అక్బార్ అనే ఉర్దూ పత్రిక యాజమాన్యం ముస్లిమేతరులదే. సంపాదకవర్గంలో అత్యధికులు కూడా హిందువులే. అలాగే హిందూస్తానీ పత్రిక కూడా హిందువులదే. అక్బారె ఆమ్, హిందుస్తాన్, ప్రతాప్, మిలాప్ వంటి పత్రికలన్నీ హిందువులు నడిపినవే. ఉర్దూ జర్నలిజంలో గంగా ప్రసాద్ వర్మ, ద్వారకా ప్రసాద్ ఉఫుక్, దీనానాథ్ హాఫిజా బాది, మున్షీ జల్వా ప్రసాద్, సూఫీ అంబా ప్రసాద్ వంటి అనేక పేర్లు మనకు వినబడతాయి. అలహాబాద్ నుంచి ప్రచురితమైన అదీబ్ పత్రికను నడిపింది కూడా హిందువులే.

మార్చి 27, 1822లో ప్రచురణ ప్రారంభించిన జామె జహానుమా పత్రిక కలకత్తాలో ప్రారంభమైంది. నిజానికి కలకత్తా ఉర్దూ భాషకు పెద్ద కేంద్రమేమీ కాదు. ఈ పత్రిక ప్రచురణకర్త హరిహరదత్త. సంపాదకుడు మున్షీ సదాసుఖ్ లాల్. ఉర్దూ జర్నలిజానికి ముస్లి మేతరుల సేవల జాబితా కూడా చాలా పెద్దది.

## భాష లక్ష్యం సమాచార మార్పిడి

భాష సమాజానికి, ప్రాంతానికి, ప్రజలకు చెందినది, భాష మతా నికి చెందినది కాదు. భాష అంటేనే సంస్కృతి. సమాజంలో నాగ రికత ప్రగతీ వికాసాల కొలమానం భాష. ఉర్దూ కూడా అలాంటిదే. ఇది ఒక సంస్కృతి. గంగా–జమునా తెహజీబ్ లేదా భిన్నత్వంలో ఏకత్వ సంస్కృతికి అత్యుత్తమ నిదర్శనం. భాష విద్యాబోధనకు సాధనం మాత్రమే కాదు అంతకన్నా ఎక్కువగా కమ్యునికేషన్ అసలు ఉద్దేశ్యం. అంటే భావ ప్రసారం. సమాచార మార్పిడి... ఈ విషయాలు కోర్టు పేర్కొంది. భాష మనుషులను కలపాలి. విడదీయరాదని, ఆలోచనల మార్పిడికి, భావప్రసారానికి, సమాచార పంపిణీకి మాధ్యమంగా భాష ఉపయోగపడాలని చెప్పింది. భావప్రసారం విషయానికి వస్తే ఉర్దూ స్వాతంత్ర్య పోరాట కాలంలో గొప్ప భూమికను పోషించిందన్నది చరిత్రను పరిశీలిస్తే అర్థమవుతుంది.

## స్వాతంత్ర్య పోరాటానికి ఊపిరులూదిన భాష

ఫైజ్ అహ్మద్ ఫైజ్ రాసిన "హమ్ దేఖేంగే" గేయం ఒక ఉదాహరణ. భారత ఉపఖండంలో అనేక ఉద్యమాల్లో ఈ కవితతో పాటు "బోల్ కే లబ్ ఆజాద్ హై" కవిత ప్రముఖంగా వినిపిస్తుంది. అలాగే మౌలానా హస్రత్ మోహానీ రాసిన రెండు పదాలు భారత ఉపఖండంలో 1921 నుంచి నేటి వరకు మారుమోగుతూనే

ఉన్నాయి. ఆ రెండు పదాలు "ఇంక్విలాబ్ జిందాబాద్" ఇవి ఉర్దూ పదాలే. భగత్ సింగ్ సగర్వంగా అసెంబ్లీ హాలుపై దాడి తర్వాత ఈ నినాదమే పలికాడు. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పిలుపిచ్చిన మొట్టమొదటి వ్యక్తి ఆయనే. 1921లోనే ఆయన "ఆజాదియే కామిల్" కావాలని డిమాండ్ చేశాడు.

**రస్మ్ జఫా కామియాబ్ దేఖియే కబ్ తక్ రహే**
(నిరంకుశత్వం ఎంతకాలమో అదీ చూద్దాం)

**హుబ్బె వతన్ మస్త్ ఖాబ్ కబ్ తక్ రహేం**
(దేశ ప్రేమికులు స్వప్నాల్లో ఎంత కాలం ఉంటారో అదీ చూద్దాం)

**దౌలతె హిందూస్తాన్ ఖబ్జాయే అగ్యార్ మేం**
(భారత సంపద పరాయి వాళ్ళ చేతుల్లో ..)

**బే అదద్ వ బే హిసాబ్ దేఖియే కబ్ తక్ రహేం**
(లెక్కా పత్రం లేకుండా ఎంతకాలమో అదీ చూద్దాం)

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో కీలకపాత్ర పోషించిన ఉర్దూ కవుల గురించి ఆ తర్వాత ఎవ్వరూ పట్టించుకోకపోవడం శోచనీయం. ఉర్దూ కవిత్వమంటే అద్భుతమైన ప్రేమ గజళ్ళుగానే భావించబడుతుంది. 'ఇంక్విలాబ్ జిందాబాద్' అని నినదించింది కూడా ఉర్దూ కవిత్వమే. సామాజిక సమస్యలపై, స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని రగిలించిన అద్భుతమైన ఉర్దూ కవిత్వాన్ని నేడు ఎవ్వరూ స్మరించడం లేదు. నిజానికి ఉర్దూలో అద్భుతమైన గజళ్ళు కూడా వచ్చాయి. ఉర్దూ కవిత్వం స్వాతంత్ర్య పోరాట కాలంలో పోషించిన కీలకపాత్ర పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది.

1857 సిపాయిల తిరుగుబాటును కవిత్వంలో రికార్డు చేసింది ఉర్దూ కవి త్వమే. తిరుగుబాటు వైఫల్యం తర్వాత షహర్ ఆషోబ్ (విషాదాలు) కవితలైనా, ఆ తర్వాత బ్రిటీషు వ్యతిరేక ప్రతిఘటనల్లో వచ్చిన కవిత్వములోనూ ఉర్దూ కవులు నిరంకుశ పాలకులపై నిజాయితీగా గళమెత్తారు. ప్రజాకాంక్షలను తమ కవిత్వంలో ప్రతిబింబించారు. ఉర్దూ కవిత్వమంటే కేవలం ప్రేమ గజళ్ళు కాదు. ఫైజ్ మాటల్లో చెప్పాలంటే, ఔర్ భీ దుఖ్ హై జమానే మేఁ ముహబ్బత్ కె సివా (ప్రపంచంలో ప్రేమే కాదు ఇంకా దుఃఖాలున్నాయి).

బిస్మిల్ అజిమాబాదీ రాసిన క్రింది పంక్తులు చూడండి ఇప్పుడు–

**సర్ఫరోషీకి తమన్నా అబ్ హమారే దిల్ మేఁ హైఁ**
(ఆత్మత్యాగం చేయాలన్న కోరిక ఇప్పుడు మా గుండెల్లో ఉంది)

**దేఖ్ నా హై జోర్ కితనా బాజుయే ఖాతిల్ మేఁ హైఁ**
(హంతకుడి చేతిలో ఎంత బలం ఉందో చూద్దాం)

ఈ గజల్ పంక్తులను పాడుకుంటూ భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్ గురు ఉరికంబం వైపు నడిచారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అల్లామా ఇక్బాల్ రాసిన **"సారే జహాఁ సే అచ్ఛా హిందూసితా హమారా"** స్వాతంత్ర్య పోరాట కాలంలో అందరి నాలుకలపై నాట్యం చేసేది. స్వాతంత్ర్య పోరాటంలో ఉర్దూ కవిత్వం కీలకపాత్ర పోషించింది. మౌలానా అల్తాఫ్ హుస్సేన్ హాలీ, బ్రిజ్ నారాయణ్ చక్ బస్త్, హస్రత్ మోహానీ, జఫర్ అలీ ఖాన్, ముహమ్మద్ అలీ జోహర్, షౌకత్ అలీ జోహర్, అల్లామా ఇక్బాల్, దుర్గా సహాయ్, సురూర్ జహానాబాదీ, త్రిలోక్ చంద్ మహ్రూమ్ ఇలాంటి అనేక పేర్లు మనకు కనబడతాయి.

కవిత్వం సామాజిక ప్రయోజనానికని నినదించినవాడు మౌలానా అల్తాఫ్ హుస్సేన్ హాలీ. ఆయన రాసిన హుబ్బె వతన్ (దేశప్రేమ) కవితకు అత్యంత ప్రజాదరణ లభించింది.

**తెరీ ఏక్ ముష్త్ ఖాక్ కే బదలే**
(నీ ఒక్క గుప్పెడు మట్టికి బదులు)

**లూఁ నా హర్‌గిజ్ అగర్ బెహిష్త్ మిలే**
(స్వర్గం దొరికినా వద్దంటాను)

ఈ పంక్తులు రాయడం మౌలానా హాలీకి మాత్రమే సాధ్యం. అక్బర్ అలహాబాదీ కూడా ఈ కాలంలో మేధావిగా పరిగణించబడిన కవి. కాని ఆయన చాలా వ్యంగ్యాత్మక ధ్వనితో రాసేవారు. అందువల్ల ఆయన కవితల్లోని తాత్విక భావాలను వ్యంగ్యం కప్పేసేది. అక్బర్ అలహాబాదీ చివరి దశలో గాంధీజీ తెరపైకి వచ్చారు. గాంధీయిజం పట్ల ఆకర్షితుడై అక్బర్ అలహాబాదీ హిందూ ముస్లిమ్ ఐక్యత కోసం చాలా కృషి చేశాడు. ఆయన కవితల్లో తీవ్రమైన హాస్యం తొణికే వ్యంగ్యం గమనించదగింది.

**బుద్ధూ మియాఁ భీ హజ్రతె గాంధీకే సాథ్ హైఁ**
(ఈ మూర్ఖుడు కూడా గాంధీగారికి తోడయ్యాడు)

**గో ఖాకె రాహ్ హైఁ, మగర్ ఆంధీకే సాథ్ హైఁ**
(స్వయంగా దుమ్ము ధూళి అయినా, సుడిగాలితో పాటున్నాడు)

చాలా లోతైన తాత్వికత ఉన్న కవిత. గాంధీజీ వెంట నడవడం వల్ల సాధారణమైన వ్యక్తి కూడా అసాధారణ ఎత్తులకు చేరుకుంటాడని చెప్పే ఈ కవితలో తీవ్రమైన వ్యంగ్యం, తనపై తానే వేసుకున్న హాస్యం కవితలో తాత్వికతను లోతుగా అర్థం చేసుకోనివ్వదు. తనలాంటి మూర్ఖుడు కూడా గాంధీజీకి తోడయ్యాడని చెప్పి, గాంధీజీని సుడిగాలితోను, తనను తాను దుమ్ముధూళితోను పోల్చుకున్నాడు. ఈ వ్యంగ్యం విన్నవెంటనే నవ్వు వస్తుంది. కాని సుడిగాలి, దుమ్ముకణాన్ని అసాధారణ ఎత్తులకు తీసుకెళుతుందన్న తాత్విక కోణాన్ని అర్థం చేసుకోనీయదు.

కాకోరి కుట్ర కేసులో శిక్షకు గురైన అష్ఫాఖుల్లా ఖాన్ గొప్ప కవి. అతను రాసిన చివరి కవిత "షోరిషె జునూన్"లో తాను ఎన్నుకున్న మార్గాన్ని ఇతరులకు స్ఫూర్తిదాయకంగా వివరించాడు.

**సభీ సామానె ఇష్రత్ థే, మజే సే కటీ థీ**
(విలాస సామగ్రి అంతా ఉండేది. హాయిగా గడిచేది)

**వతన్ కీ ఇష్క్ నే హమ్ కో హవా ఖిలాయీ జందాం కీ**
(దేశ ప్రేమ మమ్మ జైలు ఊచల వెనుకకు తెచ్చింది)

రాంప్రసాద్ బిస్మిల్ రాసిన పంక్తులు కూడా గమనించదగినవి.

**నవ్ జవానోం యహీ మోకా హై ఉఠో ఖూబ్ ఖేలో**
(యువకుల్లారా ఇదే అవకాశం లేవండి .. ఉత్సాహంగా )

**ఖిద్మతె ఖౌమ్ మేం ఆయే జో బలాయేం ఝేలో**
(జాతి సేవలో ఏ కష్టం వచ్చినా తట్టుకోండి)

బ్రిజ్ నారాయణ్ చక్ బస్త్ తన కవిత్వంలో ఇవే భావాలు కాస్త సున్నితంగా ప్రకటించాడు.

**యే ఖాకె హింద్ సే పైదా హై జోష్ కే ఆసార్**
(ఈ దేశం మట్టిలో పుడతాయి ఉత్సాహపు భావాలు)

**హిమాలయ సే ఉఠే జైసే అబ్రె దర్యార్**
(హిమాలయాల నుంచి వర్షపు మబ్బులు జన్మించినట్లు)

విప్లవకవుల గురించి రాస్తున్నప్పుడు జోష్ మలిహాబాది ప్రస్తావన తప్పనిసరి. ఆయన షాయరె ఇంక్విలాబ్‌గా పేరుపడ్డాడు.

**కామ్ హై మేరా తగ్యార్, నామ్ హై మేరా షబాబ్**
(నా పని మార్పు తేవడం, నా పేరు యవ్వనం)

**మేరా నారా ఇంక్విలాబ్ ఇంక్విలాబ్ ఇంక్విలాబ్**
(నా నినాదం విప్లవం, విప్లవం, విప్లవం)

అలీ సర్దార్ జాఫ్రీ కవి మాత్రమే కాదు, జాతీయ ఉద్యమంలో పాల్గొని జైళ్ళకు వెళ్ళాడు. జైల్లోనే అనేక కవితలు రాశాడు.

**రక్స్ కరాయీ రూహె ఆజాదీ, కె రక్సామ్ హై హయాత్**
(స్వేచ్ఛా స్ఫూర్తి నృత్యం చేయించింది. జీవితమే నాట్యం)

**ఘూమతీ హర్ వక్త్ కే మెహవర్ పర్ సారీ కాయనాత్**
(కాలం ఇరుసుపై విశ్వం నర్తిస్తుంది.)

ఉర్దూ కవిత్వం గురించి రాస్తున్నప్పుడు అంజుమనె తరఖ్కీ పసంద్ ముసన్నిఫీన్ (అభ్యుదయ రచయితల సంఘం) ప్రస్తావన లేకపోతే అసంపూర్ణమే. అభ్యుదయ రచయితల సంఘానికి జవజీవాలు ఉర్దూలోనే ఉన్నాయి. అభ్యుదయ రచయితల సంఘంలో ప్రారంభంలో అత్యధికులు ఉర్దూలో రాసినవాళ్ళే. మన తెలంగాణకు చెందిన మఖ్దూం రాసిన పంక్తులు చూడండి. ఈయన కూడా అభ్యుదయ రచయితల్లో ముఖ్యమైన కవి.

**కోహె గమ్ ఔర్ గిరాం ఔర్ గిరాం ఔర్ గిరాం**
(దుఃఖాల కొండ మరింత బరువు అయిపోతోంది)

**గమ్ జదోం తీషా చమ్కావ్ కె కుఛ్ రాత్ కటే**
(దుఃఖితులారా పారలకు పదును పెట్టి మెరిపించండి. కాస్త రాత్రి గడుస్తుంది)

పాత ప్రతీకలు మారిపోయాయి. మఖ్దూం రాసిన కవితలో తీషా (పార) సంప్రదాయక ప్రేమ కవితలో ఆత్మహత్య సాధనం. కాని మఖ్దూం దాన్ని కార్మికులకు వెలుగు అంటే విజయాన్ని సాధించే సాధనంగా ప్రతీకించాడు. నిజానికి ఇలా ప్రతీకల రీ డిఫైన్ చేయడం అన్నది ఇక్బాల్ ప్రారంభించాడు. అభ్యుదయ రచయితలు దాన్ని మరింత ముందుకు తీసుకుపోయారు. కొత్త కొత్త సింబల్స్ ఉపయోగించడం ప్రారంభించారు.

## స్వాతంత్ర్య పోరాటాన్ని ఉరకలెత్తించిన ఉర్దూ పత్రికలు

కేవలం ఉర్దూ సాహితీవేత్తలు కవులు మాత్రమే కాదు, ఉర్దూ పత్రికలు కూడా ఈ పాత్ర అద్భుతంగా పోషించాయి.

జాతీయవాదం, దేశప్రేమ, బ్రిటీషువారి దోపిడి, వ్యవసాయరంగం కమర్షియల్ అయిపోవడం వగైరా అనేక విషయాలపై ఉర్దూ పత్రికలు గొంతెత్తాయి. ఢిల్లీనుంచి వెలువడిన “అక్బారె జామె జహానుమా” 1823లో ప్రారంభమైంది. ఇదే మొదటి పత్రిక. హరిహర దత్త, మున్షీ సదా సుఖ్ దీని ప్రకాశకులు. మొదట్లో బ్రిటీషు సహాయంతోనే ప్రారంభమైంది. కాని త్వరలోనే బ్రిటీషు వారి దోపిడీని తూర్పారబట్టడం మొదలెట్టింది. ఢిల్లీ ఉర్దూ అక్బార్ పత్రిక మొదటి సంచిక నుంచే దేశంలో అవినీతి, శాంతిభద్రతల పరిస్థితి, క్రమశిక్షణా రాహిత్యాలను ఎత్తి చూపుతూ బ్రిటీషు పాలకులపై విమర్శలు సంధించింది. ఫలితంగా మూతపడక తప్పలేదు. ప్రారంభంలో ఉర్దూ పత్రికల విమర్శలు కాస్త మృదువుగా కనబడినా, ఆ తర్వాత నిగ్గదీయడం మొదలైంది. 1857 తిరుగుబాటు వెనక కూడా ఉర్దూ పత్రికల పాత్ర ఉంది. నిజానికి 1857 తర్వాత మౌల్వి అన్న పదం విప్లవవాదికి మారుపేరుగా బ్రిటీషు ప్రభుత్వం పరిగణించడం ప్రారంభించింది. తీవ్రమైన అణచివేతల పరిస్థితిలో కూడా గొంతెత్తడానికి సంశయించని ధైర్యం చూపించింది ఢిల్లీ ఉర్దూ అక్బార్ పత్రిక. 1857 తిరుగుబాటును నిర్భయంగా కవర్ చేసింది. గాలిబ్ సమకాలికుడైన మౌల్వీ బాకర్ తిరుగుబాటు సమయంలో అత్యంత సాహసోపేతంగా, అనేక కష్టాలకు ఓర్చి పత్రికను ప్రచురించేవారు. బ్రిటీషు వారిపై తీవ్రవిమర్శలతో, తిరుగుబాటు సాధించిన విజయాలను, బ్రిటీషు వైఫల్యాలు, వారి దమననీతి పత్రికలో రిపోర్టయ్యేవి. 1857 తిరుగుబాటు విఫలమైన తర్వాత ఢిల్లీ నిర్మానుష్యమైపోయింది. ఢిల్లీ ఉర్దూ అక్బార్ పత్రిక మూతపడింది. పత్రిక యజమాని ముహమ్మద్ బాకర్‌ను కాల్చి చంపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మొదటి జర్నలిస్టు ఆయనే. కోహినూర్ పత్రిక కూడా ప్రస్తావించదగింది. అవకతవకల పాలన, అవినీతి కార్యకలాపాలపై తీవ్రమైన విమర్శలు సంధించిన కోహినూర్ పత్రిక చాలా తెలివిగా వ్యవహరించేది. ఒకవైపు ప్రభుత్వాన్ని తీవ్రంగా దునుమాడుతూ, మరోవైపు ప్రభుత్వం చేసిన కొన్ని మంచిపనులను కూడా ప్రశంసిస్తూ రాసేది.

సాదికుల్ అక్బార్ పేరుతో మరో పత్రిక వచ్చేది. పూర్తిగా బ్రిటీషు వ్యతిరేక పత్రిక. బ్రిటీషు వారికి ఉర్దూ పత్రికల పట్ల వైరం ఉండేది. 1857 తిరుగుబాటుకు ముందు నుంచే ఉర్దూ పత్రికలు బ్రిటీషు వారి విధానాలను తూర్పారబడుతూ వచ్చాయి. తీవ్రమైన అణచివేత అమల్లో ఉన్నప్పటికీ, ఢిల్లీ ఉర్దూ అక్బార్ లెక్క చేసేది కాదు. భారత ఉద్యోగుల సమస్యలను ప్రస్తావించేది, పోలీసు అధికారులను తీవ్రంగా విమర్శించేది. అవధ్ సంస్థానాన్ని బ్రిటీషువారు వశం చేసుకున్న తర్వాత పేట్రేగిన అవినీతి, కల్లోల పరిస్థితిని ఈ పత్రికలు నిర్భయంగా రాశాయి. లార్డ్ కేనింగ్స్ చేసిన కేనింగ్స్ చట్టం తర్వాత ముఖ్యంగా ఉర్దూ పత్రికల స్వేచ్ఛకు కళ్ళెం వేసే ప్రయత్నాలు జరిగాయి.

బెంగాల్లో దారుల్ సల్తనత్ పత్రిక, ఉర్దూ గైడ్ పత్రిక, ఉత్తర ప్రదేశ్‌లో అహ్మదీ పత్రిక, పంజాబులో మిహిరే నౌరోజ్, అవధ్ పాంచ్, షాహనాయె హింద్ పత్రికలు బలంగా జాతీయభావాలను ప్రచారం చేశాయి. ఈ సందర్భంగా గుర్తొచ్చే మరో ముఖ్యమైన పేరు అబ్దుల్ ఖయ్యూమ్ అన్సారీ. బీహారుకు చెందిన అబ్దుల్ ఖయ్యూమ్ అన్సారీ అల్ ఇస్లాహ్ (సంస్కరణ) పత్రికకు ఎడిటర్. ఇది వారపత్రిక. మరో మాసపత్రిక "మసావాత్" (సమానతలు) కూడా ఈయన సంపాదకత్వంలో వచ్చేది. అన్సారీ ముస్లిముల్లో ముఖ్యంగా వెనుకబడిన వర్గాల కోసం పనిచేశారు. దేశవిభజనను తీవ్రంగా వ్యతిరేకించారు.

ఢిల్లీ ఉర్దూ అక్బార్ మూతపడడమూ, సంపాదకుడు బాకర్‌ను కాల్చిచంపడం జరిగిన తర్వాత ఆయన కుమారుడు ముహమ్మద్ హుస్సేన్ ఆజాద్ ఒంటరివాడయ్యాడు. చాలా పిన్నవయస్కుడు. తండ్రికి చేదోడువాదోడుగా ఉండేవాడు. చావును వెంట్రుకవాసిలో తప్పించుకుని పారిపోయాడు. తిరుగుబాటు కాలంలో బ్రిటీషు వ్యతిరేక వైఖరిని అవలంబించిన మరో పత్రిక సాదికుల్ అక్బార్ సంపాదకుడిని అరెస్టు చేసి జైల్లో పెట్టారు. అప్పటికే ప్రముఖ కవిగా పేరున్న మునీర్ షికోహాబాదీ ఫరుక్కాబాద్లో ఉండి బ్రిటీషు వారి పాలనపై తీవ్రమైన విమర్శలతో పత్రికల్లో రాసేవాడు. ఆయన్ను పట్టుకుని చిత్రహింసలకు గురిచేసి అండమాన్ తరలించారు. మరో ఉర్దూ పత్రిక గుల్షనె నౌబహార్‌పై భారీ జరిమానా విధించారు. ఆ పత్రిక మళ్ళీ నిలదొక్కుకోలేకుండా చేశారు. ఉర్దూ పత్రికలు తమకు విసురుతున్న సవాలును అణచివేయడానికి బ్రిటీషు ప్రభుత్వం దారుణమైన దమనకాండకు దిగింది.

ప్రభుత్వం తమపై ఉక్కుపాదం మోపుతున్నప్పటికీ ఉర్దూ పత్రికారంగం భయపడలేదు. భారతదేశంలో ప్రచురిస్తే బ్రిటీషు ప్రభుత్వ నిర్బంధం ఉంటుంది, కాబట్టి దేశం నుంచి బయటకు వెళ్ళి ప్రచురణ కొనసాగించారు. లండన్ నుంచి 1887లో ఆయనాయే సౌదాగరీ, 1878లో కాన్‌స్టాంటినోపుల్ నుంచి తర్జుమానె షౌక్, 1880లో టర్కీ నుంచి సుల్తానుల్ అక్బార్, 1884లో లండన్ నుంచి హిందూస్తాన్, 1914లో తాష్కెంట్ నుంచి హురియత్, 1910లో బెర్లిన్ నుంచి తల్వార్, 1914లో శాన్ ఫ్రాన్సిస్కో నుంచి హిందూస్తానీ, 1923లో న్యూయార్క్ నుంచి యాదె వతన్ ప్రచురణలు కొనసాగాయి. భారత ప్రభుత్వం 1972లో నియమించిన కమిటీ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఉర్దూ లాంగ్వేజ్ ఈ వివరాలను తెలిపింది. అంతేకాదు ఈ కమిటీ ప్రకారం, రాజా మహేంద్ర ప్రతాప్ సింగ్, మౌలానా ఉబైదుల్లా సింధీలు స్వతంత్ర భావాలను ప్రచారంలో పెట్టడానికి, రాజకీయ సాహిత్య ప్రచురణకు ఉర్దూ మాధ్యమాన్నే ముఖ్యంగా ఎంచుకున్నారు. గుర్తించవలసిన విషయమేమంటే, మొట్టమొదటి ప్రవాస ప్రభుత్వం రాజా మహేంద్రప్రతాప్ సింగ్ అధ్యక్షతన కాబూలులో ఏర్పడింది. మౌలానా ఉబైదుల్లా సింధీ తదితరులు ఇందులో మంత్రులుగా ఉండేవారు.

మున్షీ సజ్జాద్ హుస్సేన్ సంపాదకుడిగా 1877లో అవధ్ పంచ్ ప్రారంభమైంది. ఉర్దూలో వ్యంగ్యం చాలా ప్రసిద్ధిచెందింది. ఉర్దూ వ్యంగ్యరచనలను కొత్త ఎత్తులకు తీసుకెళ్ళిన పత్రిక ఇది. బ్రిటీషు పాలనాయంత్రాంగం వైఖరిని తీవ్రమైన వ్యంగ్యంతో వ్యాఖ్యానించేది. హిందూ ముస్లిమ్ ఐక్యత కోసం కూడా ఈ పత్రిక నిబద్ధంగా పనిచేసింది. 1938లో ముంబయి నుంచి వెలువడిన ఉర్దూ దినపత్రిక ఇంక్విలాబ్ సంపాదకుడు అబ్దుల్ హామిద్ అన్సారీ. కాంగ్రేసు వాదిగా ఆయన పత్రిక ద్వారా జాతీయ భావాలను ప్రచారం చేశాడు. దేశవిభజన తర్వాత జిన్నా స్వయంగా ఆయన్ను పాకిస్తాన్ రావాలని కోరినప్పటికీ ఆయన నిరాకరించాడు.

స్వతంత్ర సంగ్రామానికి ఊపిరిగా ఉర్దూ మీడియా వ్యవహరించింది. ఆ కాలంలో ఉర్దూ పత్రికల సంఖ్యను చూస్తే చాలు ఈ వాస్తవం అర్ధమవుతుంది. ఖిలాఫత్, సియాసత్, తాజ్, రోజ్ నామా హింద్, అజ్మల్, హిలాల్, మిలాప్, ప్రతాప్‌బీ తేజ్, ఖౌమీ ఆవాజ్, జంగ్, అంజామ్, ఇంక్విలాబ్, నవాయే వక్త్, హిందూస్తాన్, ఆఫ్తాబ్, జమ్హూరియత్, నదీమ్, ఇక్బాల్, అస్రె జదీద్, ఆజాదె హింద్, సందేశ్, వకీల్, ఖిద్మత్, ముసల్మాన్, ఆజాద్, అల్ జమీయత్ వంటి ఎన్నో పత్రికలున్నాయి.

ఉర్దూ పత్రికల పాత్ర గురించి మాట్లాడుతున్నప్పుడు హైదరాబాదులో నిర్భయంగా ప్రజల పక్షం వహించి హత్యకు గురైన పాత్రికేయుడు షోయబుల్లా ఖాన్ పేరు తప్పక ప్రస్తావించాలి. తేజ్ పత్రికతో తన పాత్రికేయ వృత్తి ప్రారంభించిన షోయబుల్లా ఖాన్ తర్వాత రయ్యత్ పత్రికలో ఉపసంపాదకుడిగా చేరారు. ముందుమల నరసింహరావు ఈ పత్రిక సంపాదకుడు. అది తెలంగాణా సాయుధ పోరాట కాలం. రయ్యత్ నిషేధానికి గురైంది. ఆ తర్వాత షోయబుల్లా ఖాన్ స్వయంగా ఇమ్రోజ్ పత్రికను ప్రారంభించాడు. హైదరాబాదు సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడమే మంచిదని అప్పట్లో ఏడుగురు ముస్లిం

ప్రముఖులు ఇచ్చిన పిలుపును షోయబుల్లాఖాన్ యథాతథంగా తన పత్రికలో ప్రచురించారు. షోయబుల్లా తన వద్ద ఉన్న నగనట్రా అమ్మి, బూర్గుల రామకృష్ణరావు సహాయంతో ఈ పత్రిక ప్రారంభించాడు. రజాకార్లను వ్యతిరేకిస్తూ ఆయన రాసిన రాతలు చివరకు ఆయనపై దాడికి దారితీశాయి. దాడి కాచి కత్తులతో పొడిచి ఆయన్ను చంపేశారు.

## ఉర్దూ ప్రభావం లేని భాష లేదు:

ఉర్దూ పదాలు లేదా ఉర్దూ నుండి పుట్టిన పదాలను ఉపయోగించకుండా హిందీలో రోజువారీ సంభాషణ సాధ్యం కాదు. ఈ విషయాన్ని న్యాయస్థానం కూడా చెప్పింది. 'హిందీ' అనే పదం కూడా పర్షియన్ పదం 'హిందవి' నుండి వచ్చింది.

ఆదానప్రదానాలు భాషల మధ్య జరుగుతూనే ఉంటాయి. సంస్కృతంతో సహా అనేక భాషల నుండి అనేక పదాలను ఉర్దూ స్వీకరించింది. ఉర్దూ పదాలు న్యాయవ్యవస్థపై, క్రిమినల్, సివిల్ చట్టాలు, పోలీసు, రెవిన్యూ పారిభాషిక పదాలపై చాలా ప్రభావం వేశాయి.

ముకద్దమా (కేసు), ముల్జిమ్ (నిందితుడు), ఇల్జామ్ (ఆరోపణ), ఇత్తిలా (సమాచారం), చష్మదీద్ (ప్రత్యక్ష సాక్షి), అదాలత్ (కోర్టు), హలఫ్‌నామా (డిపోజిషన్), పేషీ (విచారణ తేదీ) ఈ పదాలన్నీ ఉర్దూ పదాలే. గీటురాయిలో ఇంతకు ముందు కన్యాశుల్కం నాటకంలో ఉర్దూ పదాల వాడకంపై ఒక సుదీర్ఘ వ్యాసం బహుశా పాఠకులు చదివే ఉంటారు.

కీ.శే. గిడుగు రామమూర్తి పంతులుగారు తన "బాల కవి శరణ్యము" అనే గ్రంథంలో అన్యదేశ్యముల గురించి వివరిస్తూ ఇలా వ్రాశారు. "శ్రీ వావిలి కొలను సుబ్బారావు పంతులు గారు తమ సులభ వ్యాకరణములో రోజు, ఖర్చు, జమ, జాబు, మొదలయిన తురకమాటలు ప్రయోగార్హములు కావని నిషేధించినారు గాని ఆయన రచించిన సుభద్రా విజయము (పుట 54)లో 'కంతుతేజీ'అని ప్రయోగించినారు 'తేజీ' అన్న పదమేభాషో? ... మన దేశమును ముసల్మాను ప్రభువులు చాలా కాలము పరిపాలించి యుండినందునను, ఆ మతము వారు తురుష్కులు, పఠానులు, అరబ్బులు మొదలగువారు కోటాను కోట్లుగా అన్ని మండలములలోను స్థిర నివాసము ఏర్పర్చుకొని మనకు తోడి కాపులయి ఉన్నందున, వారి భాషలో చేరిన అరబ్బీ, పారసీ, తుర్కీ మాటలు ఒక్క మన తెలుగులోనే కాదు అన్ని భాషలలోను చేరినవి. ఈ "తురక మాటలు" అపరిహార్యములు. సరస కవితకు ఆలంబనములు, శ్రీనాధుడు అక్కడక్కడా ఒక్కొక్క మాట 'ఖుసి మీరన్' అని ప్రయోగించాడు. .... తెలుగులో ఉర్దూ మాటలు చేరి, భాషాభివృద్ధికి కారణములయినవి. సాలాఖరువలెనే నెలాఖరు, మాసవారీ, బేమర్యాద, పెత్తనదారుడు, కలక్టరీ, నిజాయితీ, గుమాస్తాగిరి, బంట్రోతుగిరి ఎంత పొందికగలిగి యున్నవో చూడండి... వేలకొలదిగా ఉన్న ఈ హిందుస్తానీ మాటలు నిత్య వ్యవహారములో ఆంధ్ర భారతి శరీరములోని అంగములయినవి. ఛేదిస్తే గాయములు పడక తప్పదు." (పుటలు 227 - 229)

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖ రీడరు డాక్టర్. కె.గోపాలకృష్ణారావు గారు తెలుగుపై ఉర్దూ పారశీకముల ప్రభావము" అనే తన గ్రంథంలో ఆదికవి నన్నయ మొదలు సి.నారాయణ రెడ్డి వరకు ఎందరో తెలుగు కవులు తమ రచనలలో ప్రయోగించిన ఉర్దూ, పార్శీ పదాలను సోదాహరణంగా వివరించారు.

ఉర్దూకు వ్యతిరేకంగా హంగామా చేసేవారికి ఇవన్నీ తెలియవా? కొందరికి తెలియకపోవచ్చు. చాలా మందికి తెలుసు. స్వయంగా తాము వాడుతున్న భాషలోని చాలా పదాలు ఉర్దూ పదాలే అన్నది సర్కారులో ఉన్న వారికి సర్కారు ఉర్దూ పదం అని తెలిసినంత స్పష్టంగా తెలుసు. అయినా రాజకీయాల్లో చాలా సార్లు జ్ఞానం కన్నా అజ్ఞానమే ఉపయోగకరమవుతుంది.

ఉర్దూ ఈ భూమిపై పుట్టిన భాష. వివిధ సాంస్కృతిక నేపథ్యాలకు చెందిన ప్రజల పరస్పర చర్యల వల్ల, అభిప్రాయమార్పిడిల వల్ల, భారతదేశంలో ఉర్దూ అభివృద్ధి చెందింది. కాని హిందీ, ఉర్దూ భాషలను మతం ప్రాతిపదికన వలసవాద శక్తులు విభజించాయి. ఇప్పుడు ఈ మతతత్వ శక్తులు హిందీని హిందువుల భాషగా, ఉర్దూను ముస్లింల భాషగా చిత్రీకరిస్తున్నాయి.

ఇది అసత్యం అన్నది స్పష్టంగా తెలుస్తున్న విషయం. అసత్యం ఎప్పటికైనా అంతరించక తప్పదు. సత్యం వెలుగులు విరజిమ్మినప్పుడు అసత్యం అంతర్థానమవుతుంది.

## ముగింపు

భారత స్వతంత్ర సంగ్రామంలో ముస్లిములు పోషించిన పాత్రను తుడిచేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లే, స్వతంత్రపోరాటంలో ఉర్దూ పుటలను చింపేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఖమర్ జలాల్వి రాసిన పంక్తులు ఈ సందర్భంగా ప్రస్తావించుకోవాలి.

**జబ్ గులిస్తాం కో ఖూం కీ జరూరత్ పడీ**
(తోటకు నెత్తురు అవసరమైనప్పుడు)
**సబ్ సే పహలే హమారీ హి గర్దన్ కటీ**
(మొదట తెగింది మా మెడలే)
**ఫిర్ భీ కహతే హై హమ్ సే యే అహ్లే చమన్**
(అయినా ఈ తోటవాళ్ళు ఏమంటున్నారంటే)
**యే హమారా చమన్ హై తుమ్హారా నహీ**
(ఇది మా తోట, మీ తోట కాదంటున్నారు)

ఈ జ్ఞాపకాలు, చారిత్రక నేపథ్యాల వెలుగులో న్యాయస్థానం చెప్పిన మాటలపై అందరూ ఆలోచించవలసిన అవసరం ఉంది. "ఉర్దూ భారతదేశానికి విదేశీ భాష అనే అపోహ నుండి ఉర్దూపై వ్యతిరేకత వస్తుంది. ఇది పూర్తిగా తప్పుడు అభిప్రాయం. మరాఠీ, హిందీ భాషల్లానే ఉర్దూ కూడా ఇండో-ఆర్యన్ భాష. ఈ దేశ స్వాతంత్ర్యం కోసం అక్షరాలతూణీరమైన భాష". ✤

# ఇస్లామీయ జీవన విధానం – ఆర్థిక సమానత్వానికి ఉత్తమ మార్గం

## సంపన్నుల నుంచి పేదలకు సంపద పంపిణీ కావడమే సరైన పద్ధతి

- డాక్టర్ సాజిద్ అబ్బాసీ

**ఇస్లామ్** ఒక సంపూర్ణ జీవన విధానం, ఇందులో ఆర్థిక వ్యవస్థ ముఖ్యమైనది. సమన్యాయం, శ్రేయోభావాలు ఇస్లాం పునాదులు. ఇస్లాంలో ఏ రంగంలో అయినా సమన్యాయం, శ్రేయోభావం కనిపిస్తాయి. అల్లాహ్ ప్రసాదించిన వ్యవస్థ మాత్రమే సమన్యాయాన్ని, శ్రేయోశుభాలను అందించగలదు. చరిత్రలో మానవ కల్పిత వ్యవస్థలన్నింటిలోనూ గందరగోళం, దౌర్జన్యం, దోపిడి తప్పనిసరిగా చోటు చేసుకుంటాయి. ఇస్లామీయ ఆర్థిక వ్యవస్థ గందరగోళం లేనిది, సమతుల్యమైనది. ఇందులో వ్యక్తులపై దౌర్జన్యాలు ఉండవు, సమాజంలో దోపిడి ఉండదు. ఈ వ్యవస్థ విశిష్టత ఏమిటంటే సంపద కేంద్రీకృతం కాదు.

పెట్టుబడిదారీ వ్యవస్థలో అన్ని లావాదేవీలు వడ్డీపై ఆధారపడి ఉంటాయి. ఇదే పెట్టుబడిదారీ వ్యవస్థలోని అతి పెద్ద లోపం. అందువల్ల ధనవంతులు మరింత ధనవంతులు అవుతారు, పేదలు మరింత పేదలు అవుతారు. వడ్డీతోపాటు, జూదం, లాటరీ, మాదక ద్రవ్యాల వ్యాపారం, అశ్లీల చిత్రాలు, లంచం, భూములను, గనులను అక్రమంగా హస్తగతం చేసుకోవడం, మోసం, దగా, రాజకీయాధికారంతో సంపద అపారంగా కూడబెట్టుకోవడం లాంటి. సంపద కూటబెట్టుకునే ఈ మార్గాలన్నీ సాధారణ ప్రజలను దోపిడీకి గురి చేసి కొద్దిమందిని మాత్రం సంపన్నులుగా మార్చేస్తాయి. అవినీతిపరులు, దుర్మార్గులు తేలిగ్గా సంపద కూడబెట్టే దారులు తెరిచేస్తాయి. వడ్డీ వ్యాపారం, అక్రమ సంపాదనా మార్గాలు తెరచుకోవడం వల్ల సంపద పేదల నుంచి సంపన్నుల జేబుల్లోకి చేరుకోవడం ప్రారంభం అవుతుంది. ఈ విధంగా గుప్పెడు మంది సంపన్నుల వద్ద వారి అవసరాల కంటే లక్షల రెట్లు ఎక్కువ సంపద పేరుకుపోతుంది. రోజంతా నిజాయితీగా పనిచేసిన తర్వాత కూడా సగటు ప్రజలు తమ కనీస అవసరాలను తీర్చుకోలేని స్థితికి చేరుకుంటారు. ఆదాయ అసమానత ఎంతగా ఉంటుందంటే, వరల్డ్ ఇనీక్వాలిటీ రిపోర్ట్ 2022 (World Inequality Report-2022) ప్రకారం, భారతదేశం ప్రపంచంలో అత్యధిక ఆర్థిక అసమానతలు ఉన్న దేశాలలో ఒకటిగా పరిగణించబడుతుంది. ఇక్కడి జనాభాలో 10 శాతం సంపన్నుల వద్ద దేశసంపద 57 శాతం కేంద్రీకృతమై ఉంది. అలాగే జనాభాలో కేవలం 1 శాతం కుబేరుల వద్ద 22 శాతం జాతీయ సంపద ఉంది. దిగువ తరగతికి చెందిన 50 శాతం మంది ప్రజల వద్ద కేవలం 13 శాతం సంపద మాత్రమే ఉంది. అంటే, వంద మందిలో ఒక వ్యక్తి వద్ద 22 ఉంటే, 50 మంది

**పెట్టుబడిదారీ వ్యవస్థలో అన్ని లావాదేవీలు వడ్డీపై ఆధారపడి ఉంటాయి. ఇదే పెట్టుబడిదారీ వ్యవస్థలోని అతి పెద్ద లోపం. అందువల్ల ధనవంతులు మరింత ధనవంతులు అవుతారు,**

వద్ద 13 ఉన్నాయి. ఇది అత్యంత అసహజమైన సంపద పంపిణీ. సక్రమ మార్గాల ద్వారా మాత్రమే సంపాదిస్తుంటే ఇలాంటి వ్యత్యాసం సాధ్యం కాదు.

2022 నివేదిక ప్రకారం, భారతదేశంలో దాదాపు 13 కోట్ల మంది తీవ్ర పేదరికంలో మగ్గుతున్నారు. ఈ పేదల దినసరి ఆదాయం కేవలం రూ.180 మాత్రమే. చాలా కొద్దిమంది వద్ద అపార సంపద పోగుపడి, ఎక్కువ శాతం ప్రజలు పేదలుగా మారినప్పుడు, మార్కెట్లో వినియోగదారుల సంఖ్య తగ్గుతుంది. దీని వలన ఫ్యాక్టరీల్లో తయారయ్యే ఉత్పత్తులకు డిమాండ్ తగ్గుతుంది. ఫలితంగా నిరుద్యోగం పెరుగుతుంది. పేదరికం మరింత పెరుగుతుంది. దారుణమైన విషయం ఏమిటంటే, సామాన్య ప్రజలు బ్యాంకుల్లో డిపాజిట్ చేసిన సొమ్ము నుంచి వేల కోట్ల రుణాలు తీసుకుని కొంతమంది నేరస్తులు దేశం విడిచి పారిపోతున్నారు.

ఇస్లామీయ ఆర్థిక వ్యవస్థలో సంపద పంపిణీ పై నుండి కిందికి ఉంటుంది. సంపన్నులపై జకాత్ విధించబడింది. ప్రతి సంవత్సరం సంపన్నుల మిగులు సంపద నుంచి రెండున్నర శాతం సమాజంలోని బలహీన వర్గాల కోసం తీసి పంచవలసి ఉంటుంది. జకాత్ అనేది తప్పనిసరిగా చేయవలసిన కనీస ఖర్చు. గరిష్టంగా పేదల కోసం చేసే ఖర్చు, దానధర్మాల్లో ఎటువంటి పరిమితి లేదు. ఎక్కువ పుణ్యాలు సంపాదించాలనుకునేవారు భారీ మొత్తంలో దానధర్మాలకు ఖర్చు చేస్తారు. ఇస్లాం ఆర్థిక వ్యవస్థ ఇస్లాం విశ్వాస వ్యవస్థతో ముడిపడి ఉంది. అల్లాహ్‌పై విశ్వాసం వల్ల మనిషిలో తాను సంపదకు అసలు యజమాని కానని, అల్లాహ్ మాత్రమే ఈ సంపదకు నిజమైన యజమాని అని, ఈ తాత్కాలిక జీవితంలో తనను కేవలం సంరక్షకుడిగా నియమించడం జరిగిందనే భావన బలంగా ఉంటుంది. నిజమైన విశ్వాసి తన అవసరానికి మించి తనకు లభించిన సంపదలో పేద బంధువుల హక్కు ఉందని అర్థం చేసుకుంటాడు. నిరుపేదల కోసం అల్లాహ్ ఇచ్చిన సంపదను ఖర్చు చేయడం ద్వారా అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెల్లించే పద్ధతి ఇస్లాం నేర్పింది. ఒకవేళ అల్లాహ్ ఆదేశాలను జవదాటి ఉన్నట్లయితే, ప్రాయశ్చిత్తంగా పరిహారం చెల్లించవలసి ఉంటుంది. పరిహారం కూడా దానధర్మాల రూపంలోనే నిర్దేశించడం జరిగింది. అల్లాహ్ ఆగ్రహానికి గురికాకుండా ఉండే మార్గం దానధర్మాలు చేయడం. అల్లాహ్ ఆదేశం ఏమిటంటే: **“నేను వారి నుండి ఎలాంటి ఉపాధినీ కోరను. వారు నాకు అన్నం పెట్టాలనీ నేను కోరను. అల్లాహ్ స్వయంగా ఉపాధి ప్రదాత, గొప్ప శక్తిసంపన్నుడు, అత్యంత దృఢమైనవాడూను” (జారియాత్ 57, 58).**

అనాథలు, నిరుపేదలు, అవసరార్థుల కోసం ఖర్చు చేసి వారి నుంచి ఏమీ ఆశించవద్దని దివ్యఖుర్‌ఆన్ బోధిస్తోంది. (దహ్ర్: 9), అంతేకాదు వారికి మేలు చేసినట్లు చెప్పుకుని మీకు లభించే ప్రతిఫలాన్ని వృథా చేయవద్దని (అల్-బఖరా: 264) హితవు గరిపింది.

ఇస్లాం అక్రమ ఆదాయ వనరులను నిషేధించడం ద్వారా సంపద కేంద్రీకరణకు దారితీసే తలుపులు మూసేసింది. వారసత్వ వ్యవస్థను ఏర్పాటు చేసింది. మరణించిన వ్యక్తి వదిలి వెళ్ళిన ఆస్తిపాస్తులు అతని వారసులకు పంపకం చేయబడతాయి. సంతానం (కుమారులు, కుమార్తెలు)తో పాటు భార్య, తల్లిదండ్రులు, తోబుట్టువులకు కూడా వారసత్వంలో వాటా లభిస్తుంది. దీనివల్ల ఒక వ్యక్తి సంపద అనేక మందికి పంపిణీ అవుతుంది. ఈ విధంగా సంపద పై నుండి అంటే సంపన్నుల నుంచి కిందికి అంటే పేదలకు ప్రవహిస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో దీనికి విరుద్ధంగా జరుగుతుంది. అధిక సంఖ్యలో ఉన్న పేదల నుంచి సంపద గుప్పెడుమంది సంపన్నుల వద్ద పోగుపడుతుంది.

జకాత్, దానధర్మాలతో పాటు ఇస్లాంలో పేదసాదలకు రుణాలివ్వాలని ప్రోత్సహించడం జరిగింది. రుణదాత మృదువుగా వ్యవహరించాలని బోధించటం జరిగింది. ఒకవేళ రుణగ్రహీత నిజంగా రుణం తిరిగి చెల్లించే స్థితిలో లేకపోతే, రుణాన్ని మాఫీ చేస్తే అల్లాహ్ నుండి ప్రతిఫలం లభిస్తుందని వాగ్దానం చేయబడింది. కాని, తీసుకున్న రుణం చెల్లించే శక్తి ఉండి కూడా దురుద్దేశంతో రుణం చెల్లించకపోతే అలాంటి వ్యక్తిని దుర్మార్గుడిగా పరిగణించడం జరిగింది. రుణగ్రస్తుడి జనాజా నమాజు చేయడానికి ప్రవక్త ముహమ్మద్ (స) ఇష్టపడేవారు కాదు. ఇదీ ఇస్లామీయ వ్యవస్థ. అయితే పెట్టుబడిదారీ వ్యవస్థ వడ్డీపై ఆధారపడి ఉంటుంది. వడ్డీని ఇస్లాం కఠినంగా నిషేధించింది. వడ్డీ తినడం అల్లాహ్‌పై, ప్రవక్తపై యుద్ధ ప్రకటనగా పేర్కొనడం జరిగింది.

అల్లాహ్ వడ్డీని ఇంత తీవ్రంగా ఎందుకు నిషేధించాడు? అనేది ఆలోచించవలసిన విషయం. వడ్డీ అనేది నిస్సహాయుడి నిస్సహాయతను వాడుకుని అతన్ని ఆర్థికంగా మరింత దెబ్బతీసే విధానం. వడ్డీ వ్యాపారికి వ్యాపారంలో నష్టమే ఉండదు. కేవలం డబ్బు ఇచ్చి డబ్బు సంపాదించడం మాత్రమే ఉంటుంది. కాని వ్యాపారంలో మాత్రం నష్టపోయే రిస్క్ ఎప్పుడూ ఉంటుంది. అదేవిధంగా, అద్దెకు ఇచ్చే వస్తువుల విషయంలోను నష్టం ఉంటుంది. ఆ వస్తువులు కొంతకాలం ఎవరు అద్దెకు తీసుకోని పరిస్థితి ఉండవచ్చు. అవి నిరుపయోగంగా పడి ఉండవచ్చు. ఆస్తికి నష్టం వాటిల్లడం, అద్దెకు తీసుకున్నవారు మోసగించే అవకాశాలు కూడా ఉంటాయి. వ్యాపారానికి, వడ్డీకి మధ్య ఉన్న మౌలిక వ్యత్యాసం ఏమిటంటే, వ్యాపారంలో లాభం వచ్చే అవకాశం ఉన్నట్లే నష్టం వచ్చే రిస్క్ కూడా ఉంటుంది. వడ్డీలో నష్టం వచ్చే అవకాశం ఉండదు. వ్యాపారంలో మనిషి శ్రమ ఉంటుంది, వడ్డీలో ఎటువంటి శ్రమ ఉండదు.

వడ్డీని నిషేధించడానికి గల మరో ముఖ్య కారణం ఏమిటంటే, వడ్డీ వ్యాపారి నిస్సహాయ పేదలకు సహాయం చేసే బదులు వారి పేదరికాన్ని వాడుకుని లాభాలు పొందాలనుకుంటాడు. వడ్డీని అనుమతిస్తే, ప్రతి సంపన్నుడు తన సామర్థ్యం, నైపుణ్యం, అనుభవాలను ఉపయోగించి కష్టపడి సంపాదించడం మానేసి, వడ్డీని ఆదాయ వనరుగా చేసుకుంటాడు. శ్రమ లేకుండా, భవిష్యత్తు గురించి ఎటువంటి ఆందోళన లేకుండా డబ్బుతో డబ్బు సంపాదిస్తూ ఉంటాడు. సమాజంలోని సంపన్నులందరూ ఇదే ఆదాయ మార్గాన్ని ఎంచుకుంటే, విలువైన మానవ వనరులు వృథా అవుతాయి. డాక్టర్ వైద్యం చేయడం మానేస్తాడు, ఇంజనీర్ తన ఇంజనీరింగ్‌ను వదిలివేస్తాడు, ఉపాధ్యాయుడు బోధించడం మానేస్తాడు, రైతు వ్యవసాయం చేయడం మానేస్తాడు, కర్మాగార యజమాని ఉత్పత్తి చేయడం మానేస్తాడు, వ్యాపారి వ్యాపారం చేయడం మానేసి... వీళ్ళందరు వడ్డీ వ్యాపారం చేయడం ప్రారంభిస్తే, అటువంటి పరిస్థితిలో సమాజం అభివృద్ధి చెందగలదా?

వడ్డీ ఆధారిత ఆర్థిక వ్యవస్థను స్వార్థపరులు మాత్రమే ఇష్టపడతారు. ఈ వ్యవస్థలో సంపన్నులు లాభపడతారు, సాధారణ

**ఇస్లామీయ ఆర్థిక వ్యవస్థలో సంపద పంపిణీ పై నుండి కిందికి ఉంటుంది. సంపన్నులపై జకాత్ విధించబడింది. ప్రతి సంవత్సరం సంపన్నుల మిగులు సంపద నుంచి రెండున్నర శాతం సమాజంలోని బలహీన వర్గాల కోసం తీసి పంచవలసి ఉంటుంది. జకాత్ అనేది తప్పనిసరిగా చేయవలసిన కనీస ఖర్చు.**

ప్రజలు పేదలుగా మారుతారు. మనుషులందరికీ ప్రభువైన అల్లాహ్ రూపొందించే ఆర్థిక వ్యవస్థలో ప్రజలందరికీ మేలు జరుగుతుంది, ఈ వ్యవస్థ వల్ల పరస్పర సానుభూతి కలిగిన సత్సమాజం ఏర్పడుతుంది. వడ్డీ పూర్తిగా స్వార్థపూరితమైన, దోపిడీ స్వభావమున్న ఆర్థిక కార్యకలాపం. ఇక్కడ ఏకపక్షంగా ఒకరు దౌర్జన్యానికి పాల్పడితే మరొకరు బాధితుడిగా ఉంటాడు. వడ్డీ ద్వారా లాభం పొందే వ్యక్తి శ్రమించాల్సిన అవసరం లేదు, ఎటువంటి నష్టాన్ని భరించాల్సిన అవసరం లేదు. వడ్డీ కాకుండా సమాజంలో డబ్బు సంపాదించడానికి ఉన్న ఇతర మార్గాలలో శ్రమ ఉంటుంది, దీని ద్వారా సమాజానికి ఏదో ఒక రకమైన సహకారం అందుతూ ఉంటుంది. ఈ ఆర్థిక కార్యకలాపాల్లో నష్టపోయే ప్రమాదం కూడా ఉంటుంది. వ్యాపారం క్షీణించవచ్చు అనే భయం ఉంటుంది, ఉద్యోగికి తన ఉద్యోగం పోవచ్చు లేదా ఉద్యోగంలో ప్రమాదం జరగవచ్చు లేదా ఆరోగ్యంపై ప్రభావం చూపే ఉద్యోగం కావచ్చు అనే భయం ఉంటుంది. యజమాని, ఉద్యోగి కలిసి సమాజానికి ఏదో ఒక ఉపయోగ కరమైన ఉత్పత్తిని అందిస్తారు. అందువల్ల అల్లాహ్ వ్యాపారాన్ని హలాల్ (ధర్మబద్ధమైనది)గా, వడ్డీని హరామ్ (నిషిద్ధమైనది)గా ప్రకటించాడు.

పెట్టుబడిని ఏదైనా వ్యాపారం లేదా పరిశ్రమలో పెట్టవచ్చు, అందులో లాభం, నష్టం రెండూ వచ్చే అవకాశం ఉంటుంది. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ డిమాండ్, సరఫరా సూత్రంపై పనిచేస్తుంది. శ్రామికులకు ఎంత అన్యాయం జరుగుతుందనేది ఈ వ్యవస్థ పట్టించుకోదు. కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉంటే,

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

నిస్సహాయ స్థితిలో కార్మికులు అతి తక్కువ వేతనంతో పని చేయడానికి అంగీకరిస్తారు, కానీ వారు ఎంత కష్టపడినా వారి కడుపు నిండదు. ఇలాంటి పరిస్థితిలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత, కానీ కార్మికుడికి కనీసం అతని కడుపు నింపేంత వేతనం అయినా లభించాలి. ఇస్లామీయ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వం వేతనాలు, ధరలను నియంత్రిస్తుంది, తద్వారా ఆర్థిక దోపిడీ జరగదు. ఇస్లాం అక్రమ నిల్వలను తీవ్రంగా నిషేధిస్తుంది. ప్రజల బలహీనతను ఉపయోగించి ధరను తగ్గించడం లేదా  పెంచడం,  మోసపూరితంగా వస్తువులు అమ్మడాన్ని కూడా ఇస్లాం నిషేధిస్తుంది.

ఇస్లామీయ ఆర్థిక వ్యవస్థలో సమన్యాయం, శ్రేయోభావం- ఈ రెండింటికి పూర్తి ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. ఆర్థిక లావాదేవీలలో అన్యాయం, దుర్మార్గానికి  పూర్తిగా దూరంగా ఉండటమే సమన్యాయం. ఒకవేళ ఈ ప్రపంచంలో ఒక వ్యక్తి మరొకరి హక్కును హరించి తింటే, తీర్పు దినాన అల్లాహ్ అతని పుణ్యాలను బాధితుడి ఖాతాలో వేయడం ద్వారా న్యాయం చేస్తాడు. ఒకవేళ దౌర్జన్యపరుడి పుణ్యాలు అయిపోతే, బాధితుడి పాపాలు దుర్మార్గుడి ఖాతాలో వేయబడతాయి. ఇస్లాం న్యాయాన్ని గురించి నొక్కి చెప్పింది, శ్రేయోభావాన్ని ప్రోత్సహించింది.  జకాత్ చెల్లించడం సమన్యాయం అయితే, జకాత్ కంటే ఎక్కువ దానధర్మాల రూపంలో ఖర్చు చేయడం శ్రేయోభావం. రుణం ఇవ్వడం, రుణగ్రస్తుడికి రాయితీ ఇవ్వడం అతని పట్ల మెతగ్గా వ్యవహరించడం, రుణాన్ని రద్దు చేయడం- ఇవన్నీ శ్రేయోభావం క్రిందికి వస్తాయి.

ఇస్లామీయ బ్యాంకింగ్  ప్రాథమిక సూత్రాలు ఖురాన్ నుండి తీసుకోబడ్డాయి. న్యాయం, పారదర్శకత,  సామాజిక సంక్షేమంపై ఆధారపడిన ఒక ఆర్థిక వ్యవస్థను స్థాపించడం ఇస్లామీయ బ్యాంకింగ్ లక్ష్యం.

ఇక్కడ ఇస్లామీయ బ్యాంకింగ్‌కు సంబంధించిన ముఖ్యమైన ప్రాథమిక సూత్రాలు చూద్దాం:

**1) వడ్డీ నిషేధం** : ఇస్లామీయ బ్యాంకింగ్‌లో అన్ని ఆర్థిక లావాదేవీలు వడ్డీ రహితంగా ఉంటాయి. లాభనష్టాల్లో భాగస్వామ్యం (Profit & Loss Sharing) సూత్రంపై ఇస్లామీయ బ్యాంకులు పనిచేస్తాయి.

**2) స్పెక్యులేటివ్ ట్రేడింగ్, గాంబ్లింగ్ నిషేధం** : ఇస్లామీయ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితమైన, మోసపూరితమైన లేదా జూదంపై ఆధారపడిన లావాదేవీలకు అవకాశం లేదు. అన్ని లావాదేవీలు పారదర్శకంగా, స్పష్టంగా ఉండాలి. ఉదాహరణకు, మీకు ఎప్పుడు, ఎంత లాభం వస్తుందో స్పష్టంగా తెలియని పథకంలో మీరు డబ్బు పెట్టుబడి పెడితే, దానిని స్పెక్యులేటివ్ ట్రేడింగ్ లేదా గరర్ అంటారు, ఇందులో అనిశ్చితి ఉంటుంది. అదేవిధంగా, లాటరీలో డబ్బు పెట్టడం జూదం. ఇది నిషిద్ధం. ఇందులో విలువైన పెట్టుబడి దురాశ కారణంగా పోతుంది, దీని వలన పరస్పరం వైరం పెరుగుతుంది.

**హలాల్ పెట్టుబడి** : ఇస్లామీయ బ్యాంకులు షరీఅత్ ప్రకారం ఉన్న వ్యాపారాలలో మాత్రమే పెట్టుబడి పెడతాయి. మద్యం, పంది మాంసం, జూదం లేదా అనైతిక వినోదానికి సంబంధించిన వ్యాపారాలలో పెట్టుబడి నిషేధించబడింది.

**ముదారబా, ముషారకా** : ఇస్లామీయ బ్యాంకింగ్‌లో పెట్టుబడిదారుడు, వ్యాపార భాగస్వామి ఒక ఒప్పందం చేసుకుంటారు. దీనిలో లాభం అంగీకరించిన నిష్పత్తిలో పంపిణీ చేయబడుతుంది. నష్టం పెట్టుబడి నిష్పత్తి ప్రకారం భరించబడుతుంది.

**ముదారబా** : బ్యాంకు డబ్బును అందిస్తుంది, మీరు వ్యాపారం చేస్తారు. లాభాలు పరస్పరం అంగీకరించిన నిష్పత్తిలో పంపిణీ అవుతాయి. పరస్పర అంగీకారంతో వ్యవహారం నిర్ణయించబడుతుంది. నష్టం సంభవిస్తే, బ్యాంకు నష్టాన్ని భరిస్తుంది,  వ్యాపార భాగస్వామి శ్రమ, సమయం వృథా అవుతాయి.  (వ్యాపారంలో నిజాయితీ ఉంటే, మోసం లేకపోతే).

**ముషారకా** : బ్యాంకు పెట్టుబడి పెడుతుంది, మీరు కూడా పెట్టుబడి పెడతారు. ఇద్దరూ లాభనష్టాలను పంచుకుంటారు.

**ఆస్తి ఆధారిత ఫైనాన్సింగ్ (Asset-based Financing) :** ఇస్లామీయ బ్యాంకింగ్‌లో ఆర్థిక ఒప్పందాలు నిజమైన ఆస్తులు లేదా సేవలపై ఆధారపడి ఉంటాయి. ఇది డబ్బుతో డబ్బు సంపాదించడం కాదు. ఇందులో నాలుగు రూపాలు ఉన్నాయి:

యువతరానికి విప్లవనాదం
చేతన వాదం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

**మురాబహా** : వస్తువుల కొనుగోలు అమ్మకాలపై లాభం పొందడం. వడ్డీకి, మురాబహాకు మధ్య వ్యత్యాసాన్ని ఈ ఉదాహరణ ద్వారా అర్థం చేసుకోవచ్చు. సాంప్రదాయిక బ్యాంకు మీకు ఒక లక్ష రూపాయల రుణం ఇచ్చి దానిపై పది వేల రూపాయల వడ్డీని వసూలు చేస్తుంది. ఇది ఇస్లాంలో హరామ్ (నిషిద్ధం). అయితే, ఇస్లామీయ బ్యాంకు మీకు ఒక లక్ష రూపాయల విలువైన కారును కొనుగోలు చేసి ఇస్తుంది, మీరు ఒక లక్షా పది వేల రూపాయలను 12 వాయిదాలలో చెల్లించే ఒప్పందం చేసుకుంటారు. మరొక ఉదాహరణ: బ్యాంకు యాభై వేల రూపాయల విలువైన మొబైల్ ఫోన్‌ను కొనుగోలు చేసి మీకు ఇస్తుంది, మీరు 12 వాయిదాలలో అరవై వేల రూపాయలు చెల్లించాలని చెబుతుంది. దీనిని మురాబహా అంటారు. ఇది వస్తువుల కొనుగోలు అమ్మకాలపై ఆధారపడి ఉంటుంది, అంటే బ్యాంకు ఒక వస్తువును కొనుగోలు చేసి దానిని విక్రయిస్తుంది, అయితే వడ్డీలో వస్తువుల కొనుగోలు అమ్మకం ఉండదు.

**ఇజారా** : ఏదైనా భవనం లేదా వాహనం అద్దెను వసూలు చేయడం.

**సలమ్** : ఉదాహరణకు, రైతుకు ముందుగానే డబ్బు ఇచ్చి, కొంతకాలం తర్వాత నిర్ణీత ధరకు ధాన్యం ఇవ్వడం వంటి ఒప్పందాలు.

**ఇస్తిస్నా** : ఉదాహరణకు, ఒక నిర్దిష్ట నమూనా ప్రకారం యంత్రాన్ని తయారు చేయమని కర్మాగారానికి చెప్పడం జరుగుతుంది. బ్యాంకు దాని ధరను వాయిదాలలో చెల్లిస్తుంది.

**సమాజ సంక్షేమం** : ఇస్లామీయ ఆర్థిక వ్యవస్థలో ఒక ముఖ్యమైన లక్ష్యం అవసరమైన వారికి సహాయం చేయడం. ఉదాహరణకు ఒక ఇస్లామీయ బ్యాంకు లాభం లేకుండా 'ఖర్జ్-ఎ-హసనా' పథకం కింద రుణం ఇస్తుంది,దీనివల్ల చిన్న వ్యాపారులు లేదా విద్యార్థులు ప్రయోజనం పొందగలరు. అదేవిధంగా, బ్యాంకు జకాత్, ఇతర దానధర్మాల ద్వారా వచ్చిన డబ్బుతో పేదలకు సహాయం చేస్తుంది. దాతలు ఇస్లామీయ బ్యాంకులో జకాత్, దానధర్మాలను జమ చేస్తారు.

ఇస్లామీయ ఆర్థిక వ్యవస్థలో సుకూక్ (Financial bonds)కు అవకాశం ఉంది. అవి క్రింది విధంగా ఉంటాయి.

**ఇజారా సుకూక్ (Lease based bonds) :** ఇందులో ఏదైనా వస్తువు (ఉదాహరణకు భవనం) అద్దెకు ఇవ్వబడుతుంది. పెట్టుబడిదారులు దాని యజమానులుగా అద్దె ఆదాయాన్ని పొందుతారు. మరొక ఉదాహరణ ఏమిటంటే, ప్రభుత్వం రోడ్డు వేయడానికి సుకూక్‌లను జారీ చేస్తుంది, పెట్టుబడిదారులకు టోల్ టాక్స్ నుండి వచ్చే డబ్బు అద్దె రూపంలో అందుతూ ఉంటుంది.

**ముదారబా సుకూక్ (Profit sharing bonds):** పెట్టుబడిదారులు పెట్టుబడులు పెడతారు, లాభం నిర్ణీత రేటు ప్రకారం పంపిణీ చేయబడుతుంది. ఉదాహరణకు, ఒక సంస్థ విద్యుత్ ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తుంది, దాని నుండి వచ్చే లాభం పెట్టుబడిదారులకు ఇవ్వబడుతుంది.

**ముషారకా సుకూక్ (Joint venture bonds)** : ఇందులో కంపెనీ, పెట్టుబడిదారులు ఇద్దరూ డబ్బు పెట్టుబడి పెడతారు. లాభనష్టాలు సమానంగా పంచుకుంటారు. ఉదాహరణకు, ఒక హౌసింగ్ స్కీమ్ కోసం సుకూక్‌లు జారీ చేయబడతాయి, పెట్టుబడిదారులు అద్దె లేదా ఇళ్ల అమ్మకం నుండి ఆదాయం పొందుతారు.

**ప్రాజెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ సుకూక్ (Project financing bonds):** ఈ సుకూక్‌లు ప్రత్యేకంగా ఏదైనా ఉత్పత్తి లేదా నిర్మాణం కోసం ఉంటాయి, పారిశ్రామిక ప్రాజెక్ట్ లేదా నిర్మాణ ప్రాజెక్ట్ వంటి వాటి కోసం. ఉదాహరణకు, ఒక కర్మాగారాన్ని నిర్మించడానికి సుకూక్‌లు జారీ చేయబడతాయి, వాటి నుండి ఆదాయం రావడం మొదలైనప్పుడు పెట్టుబడిదారులకు చెల్లింపులు జరుగుతాయి.

**జిరాయితి సుకూక్ (Commodity bonds)**: ఇందులో పెట్టుబడిదారులు ఏదైనా వస్తువు (ఉదాహరణకు పంట) ధరను ముందుగానే చెల్లిస్తారు. ఆ ఉత్పత్తిని తరువాత తీసుకుంటారు. ఉదాహరణకు, ప్రభుత్వం లేదా బ్యాంకు రైతులకు పెట్టుబడి ఇస్తుంది. తర్వాత నిర్ణీత ధరకు రైతులు పంటను వారికి అందిస్తారు.

ఇస్లామీయ ఆర్థిక వ్యవస్థ స్వార్థం లేని సంక్షేమ రాజ్యాన్ని నిర్మించడానికి సహాయపడుతుంది. దీనివల్ల ఆర్థిక అంతరాలు తగ్గిపోయి, ఆర్థిక సమానత్వం ఏర్పడుతుంది. ఇస్లామీయ ఆర్థిక వ్యవస్థలో మానవత్వం, సానుభూతి భావాలు ఉంటాయి. ఇందులో ధనవంతులు పేదల పట్ల దయ కలిగి ఉంటారు. పేదలు ధనవంతులకు కృతజ్ఞులై ఉంటారు. దేశంలోని ప్రజలందరూ దైవభక్తి, ధర్మపరాయణతల ద్వారా సమన్యాయం, శ్రేయోభావాలు కలిగి ఉంటారు. ప్రతి పౌరుడి దృష్టి పరలోక సాఫల్యంపై ఉంటుంది. అందువల్ల ప్రపంచంలో సమన్యాయం, శ్రేయోభావాల పునాదులపై ఒక సంక్షేమ రాజ్యం ఏర్పడుతుంది.



# పుస్తక పఠనం

**- ఎస్.ఎమ్.మలిక్**

**(ఆ మధ్య మాటల సందర్భంలో ఇస్లామీయ ఉద్యమ నాయకులు ఒకరు కార్యకర్తలను గురించి, "మన కార్యకర్తలు ఉద్యమ సాహిత్యం చదవడం బాగా తగ్గిపోయింది. సాహిత్య అధ్యయనం మరీ తగ్గిపోతే ఉద్యమ స్ఫూర్తి కూడా క్షీణిస్తుందని నా అనుభవం చెబుతోంది" అని వాపోయారు. అది పూర్తిగా వాస్తవం అన్నది నాకూ తెలిసిన విషయమే. ఆ యదార్థాన్ని దృష్టిలో పెట్టుకునే ఈ వ్యాసం వ్రాయడం జరిగింది. మిత్రులు కాస్త శ్రద్ధ చూపగలరని ఆశిస్తున్నాను)**

**"ఇది దైవ గ్రంథం, ఇందులో ఎటువంటి సందేహానికి ఆస్కారం లేదు. ఇది దైవం పట్ల భక్తితో మసలుకునే వారికి మార్గబోధనం."**

***(అల్ బకర. 2:1,2)***

## జ్ఞాన ప్రధానం

''ఇస్లామ్'' ప్రారంభ క్షణం నుంచీ జ్ఞాన ప్రధానమయిన ధర్మం. దైవ ప్రవక్త ముహమ్మద్ (స)ను దైవం ప్రవక్తగా ఎన్నుకున్న సమయంలోనే ''ఇఖ్రా'' అనే పదంతో దైవ సందేశం మొదలయింది. ఇఖ్రా అంటే 'చదువు' అని అర్థం కదా. పైన పేర్కొన్న దివ్య గ్రంథ (కుర్‌ఆన్) వచనాలు, తొలి స్తవన (అల్ హమ్ద్) సూరా తరువాతి సూరా (అల్ బకర) లోని తొలి వచనాలు. ఇందులోనూ గ్రంథమే ప్రధానాంశం. దీని వల్ల చదవడం, జ్ఞాన సముపార్జన చేయటం ఈ ధర్మంలో ప్రముఖమయినవి అన్న విషయం ప్రస్ఫుటమవుతోంది. గత శతాబ్దంలో భారత ఉప ఖండంలో ప్రారంభమయిన ఇస్లామీయ ఉద్యమం పుస్తక ప్రధానంగానే విలసిల్లిందన్నది మరువరాదు.

పుస్తకం జ్ఞానానికి ప్రతీక. ఇస్లామ్ కూడా జ్ఞాన సముపార్జనకే ప్రాధాన్యత ఇస్తుంది. ఇస్లామీయ ఉద్యమం ఇస్లామ్‌ను దాని నిజ రూపంలో అర్థం చేసుకోవడం ముఖ్యమని, దానికి గాను ఇస్లామ్‌ను దాని విభిన్న కోణాలలో విశద పరిచే సాహిత్యం ప్రచురించింది. ఆ సాహిత్యం ఆకళింపు చేసుకోనిదే ఉద్యమాన్ని ఆచరణాత్మకంగా అమలు పరచడం సాధ్యం కాదన్న విషయాన్ని ఎవరూ కాదనలేరు. ఈ ఉద్యమ వైతాళికుడు మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూదీ స్వయంగా తాను కూడా ఉద్యమ సాహిత్యాన్ని పలుమార్లు చదువుతూ ఉంటానని చెప్పారు.

## నిరాసక్తత

అయితే సాధారణంగా మన కార్యకర్తలు, ''సాహిత్యం మనం చదివినదే కదా, మాటిమాటికి చదవవలసిన అవసరం ఏమిటీ?'' అని ఊహించుకుంటారు. పైగా ఉద్యమ పత్రికలు కూడా చదువుతూ ఉంటాము, నాయకులు, పండితులు చెప్పే కుర్‌ఆన్ పాఠాలు, ప్రసంగాలు వింటూనే ఉంటాము. ఇంకా ప్రత్యేకంగా సాహిత్య పఠనం కూడానా? అని ప్రశ్నించుకుని తృప్తి చెందుతారు. కాని ఇది సరయిన ఆలోచనా విధానం కాదు. దివ్య కుర్‌ఆన్ తోపాటు సాహిత్యం మన శక్తి సరోవరం, బల ప్రదాయని. ఆంతర్యాన్ని పరిశుద్ధ పరిచి కార్యోన్ముఖం చేసే గురువు.

ఇది అతిశయోక్తి కాదు. స్వయంగా నేను కూడా మన సాహిత్యాన్ని అనేక పర్యాయాలు చదివిన సందర్భాలున్నాయి. ప్రతి సారీ ఏదో ఓ కొత్త కోణం స్ఫురిస్తుంది, కొత్త జీవం ఉదయిస్తుంది, కొత్త ఉత్తేజం ప్రాణం పోసుకుంటుంది! ఏ విధంగానయితే దివ్య కుర్‌ఆన్, దాని వ్యాఖ్యానం ఎంత చదివినా తనివి తీరదో అదే విధంగా సైద్ధాంతిక ఉద్యమాల నాయకులయినా, కార్యకర్త

లయినా ఉద్యమ సాహిత్యాన్ని నెమరు వేసుకుంటూ ఉండాలి, మనకు గుర్తుకు రాని అనేక విషయాలు ఆంతర్యంలో తళు క్కున మెరుస్తాయి.

మనం ఒక సైద్ధాంతిక ఉద్యమ కార్యకర్తలము. మన ఉనికిపాటే సూత్రప్రాయమయిన ఉనికిపాటు. మన జీవితం ఒక ఆశయ పూర్వకమయిన జీవితం. నేడు మనం చూస్తూనే ఉంటాము, జనం అల్లాటప్పాగా జీవితాలు గడుపుతున్నారు. వారి వ్యక్తిగత జీవితంలోనూ ఏ సిద్ధాంతం, ఏ సూత్రం, ఏ ఆశయం ఉండదు, సాముదాయిక జీవితంలోనూ ఏ సిద్ధాంతం, ఏ ఆశయం ఉండదు. ఇంకా వారి జీవితం ఏ జీవన దాయక, శాశ్వత ఉద్యమంతోనూ ముడిపడి ఉండదు. జీవితం అంతటా సతత సంరంభం, వినోదం, వ్యాహ్యాళి జరుపుకోవడం, తిని త్రాగి, సంతతిని పెంచు కోవడం తప్ప ఏమీ మిగులదు. నిజమే, జీవితంలో ఇవన్నీ జరగ వలసిందే కాని ఓ సిద్ధాంతం ఆధారంగా, ఓ సూత్రం రీత్యా, ఓ ఆశయం కొరకు!

## ఓ ఉపమానం

అలాగే పుస్తక అధ్యయనం కూడా ఒక ఆశయంతో జరగాలి. చదవడం అంటే ఏదో విధంగా చదివేసి ముగించడం కాదు. మనకు తెలుసు, పొలంలో ఏ విధంగా విత్తడం జరుగుతుందో. పూదోట ఏ విధంగా అలంకరించడం జరుగుతుందో. మరి అడవి ఏ విధంగా పెరుగుతుందో కూడా మనకు తెలుసు. అయితే ఒక విషయం, మన పని అడవిని పెంచడం కాదు, పొలం పండించడం, ఇంకా పూదోటను అమర్చడం. ఒకవేళ మన వద్ద అడవి పెరిగిందని అనుకుంటే అందులోని ముళ్ళ పొదల్ని, అడ్డదిడ్డంగా పెరిగిన పిచ్చి మొక్కల్ని, పీకి వేసి శుభ్రం చేసుకోవాలి. తోటలో కాలిబాటలుంటాయి, దారులుంటాయి, ఏ పూమడి దగ్గరకు వెళ్ళాలన్నా సునాయాసంగా వెళ్ళవచ్చు. ఏ పువ్వును చూసి సమీపించి ప్రయోజనం పొందగోరినా పొందవచ్చు. తోటను ఆ విధంగా తీర్చిదిద్దుకోవాలి.

పుస్తక అధ్యయనానికి ఈ ఒక్క ఉపమానం సరిపోతుందని అనుకుంటున్నాను. మనం విషయ జ్ఞానం అడవిగా కాదు, పొలంలా విత్తాలి, ఓ పూదోటలా అలంకరించాలి, దానికి నీరు పోసి మరీ పెంచాలి. దీని ద్వారా ప్రయోజనం మనకూ ఒనగూడు తుంది, ఇది ఇతరులకూ ప్రయోజనకరమవుతుంది. ఏ విష యాన్ని నెమరు వేసుకోవాలనుకుంటే అది గుర్తు చేసుకో వచ్చు. ఇక చేయవలసింది ఏమిటంటే, ఈ దిగువ విషయాలు తేల్చుకోవాలి:

మనకు ప్రస్తుతం ఏ విషయం పట్ల అధ్యయనం చేయడం అవసరం?

✦ ఏ ఏ పుస్తకాలు మన వద్ద ఉన్నాయి?

✦ వీటిలో ఏ పుస్తకాలను ఏ క్రమంలో చదవాలి?

అనే నిర్ణయంతో పఠన కార్యక్రమం రూపొందించుకుని ప్రారంభిం చాలి. ఈ సందర్భంలో ఒక విషయాన్ని గుర్తు చేయదలిచాను. మౌలానా మౌదూదీ తఫ్‌హీముల్ కుర్‌ఆన్ ఉపోద్ఘాతంలో దివ్య కుర్‌ఆన్ అధ్యయనం గురించి ఓ సూచన చేశారు-

ఏదైనా ఒక సామాన్య విషయాన్ని గురించి కుర్‌ఆన్‌ని అధ్యయనం చేయదలిస్తే ఆ విషయానికి సంబంధించి సామాన్యంగా ప్రాప్త మయ్యే పుస్తకాలను ముందు అధ్యయనం చేసుకోవాలి. ఆ పైన దివ్య కుర్‌ఆన్‌ని అధ్యయనం చేయాలి, అప్పుడు ఆ విషయం పట్ల సమగ్రమయిన అవగాహన కలుగుతుంది.

## పఠన కార్యక్రమం

నేను ఉద్యమ సాహిత్యం గురించి అటువంటిదే ఓ సలహా ఇవ్వదలిచాను.

మన మౌలిక సాహిత్యాన్ని అధ్యయనం చేసి ఉన్నవారయితే కొన్ని విషయాలను ఎన్నుకుని వాటికి సంబంధించిన సాహిత్యం లేదా పుస్తకాలను క్రమబద్ధంగా అధ్యయనం చెయ్యడం మొదలెట్టాలి. ఆ సందర్భంలో ఏ ఏ విషయాలు సరిగ్గా బోధ పడలేదో వాటిని మన మిత్రుల్ని అడిగి తెలుసుకోడానికి సంకోచించరాదు. అధ్యయనం చేసినంత వరకు విషయాన్ని మన స్వంత మాటల్లో నోట్స్‌గా భద్రపరచుకోవాలి. ఆ తరువాత సమయం సందర్భం వచ్చినప్పుడల్లా ఆ విషయం పట్ల తప్పక చర్చించడానికి ప్రయత్నించాలి.

ఈ విధంగా మనం అధ్యయనం చేసిన విషయాలు అన్నింటినీ ఒక్కొక్క దాన్నే క్రమంగా పునశ్చరణ చేసుకోవాలి. అప్పుడే ఉద్యమం మనలోనూ బలపడుతుంది, మనమూ సాహిత్యం ద్వారా శక్తిని పుంజుకోగలుగుతాము. మనమందరం ఇలా శక్తిని పెంచుకున్నప్పుడే మొత్తానికి ఉద్యమంలో సరికొత్త ఉత్సాహం వెల్లివిరుస్తుంది.

ఈ సందర్భంలో మనకు ఉపకరించే, మన శిక్షణకు దోహదపడే కొన్ని విషయా **(Topic)**లను ప్రస్తావించడం భావ్యమని భావి స్తున్నాను:

➡ విశ్వాసాలు
➡ తక్వ
➡ ఆరాధనలు
➡ ఇస్లామ్ - జీవన విధానం
➡ జమాఅత్ అవసరమా?
➡ ఇస్లామీయ సందేశం - దాని ఆవశ్యకతలు
➡ సామూహిక వ్యవస్థ
➡ ఇస్లామీయ ఉద్యమం - దాని సఫలత

సుశిక్షణ

ఇంకా మరిన్ని విషయాలను ఎన్నుకుని ఈ జాబితాలో చేర్చుకోవచ్చు.

✤

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

**తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది** **ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

**35 ఆయత్‌లు** **మక్కా అవతరణ**

# 46. అల్ అహ్కాఫ్

## ప్రవేశిక

**పేరు :** 21వ ఆయత్‌లోని వాక్యం **ఇజ్ అన్‌జర ఖౌమిహూ బిల్ అహ్కాఫ్** నుండి గ్రహించబడింది.

**అవతరణ కాలం :** ఒక చారిత్రక సంఘటన ద్వారా ఇది నిర్ణయమయిపోతుంది. దాని ప్రస్తావన 29 – 32వ ఆయత్ లలో వచ్చింది. ఈ ఆయత్‌లలో జిన్నులు వచ్చి, ఖుర్ఆన్ విని తిరిగి వెళ్ళడాన్ని గురించి పేర్కొనడం జరిగింది. ఆ సంఘటన హదీసు, ప్రవక్త చరిత్రకు సంబంధించిన ఏకగ్రీవ ఉల్లేఖనాల ప్రకారం, ప్రవక్త మహనీయులు (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) తాయిఫ్ నుండి మక్కా పుణ్యపురికి తిరిగి వస్తూ నఖ్లా అనేచోట మకాం వేసినప్పుడు సంభవించింది. విశ్వసనీయ చారిత్రక ఉల్లేఖనాల ప్రకారం ఆయన తాయిఫ్ వెళ్ళిన సంఘటన హిజ్రత్‌కు మూడేళ్ళ పూర్వం జరిగింది. దీనివల్ల ఈ సూరా నబవీ 10వ సంవత్సరం చివరన లేదా 11వ సంవత్సరం ప్రారంభకాలంలో అవతరించి ఉంటుంది.

**చారిత్రక పూర్వరంగం:** నబవీ 10వ సంవత్సరం, ప్రవక్తశ్రీ జీవితంలో అత్యంత కఠినమయిన సంవత్సరం. మూడేళ్ళుగా కురైష్ తెగలన్నీ కలసి బనీ హాషిమ్ (హాషిమ్ వంశస్థుల)ను, ముస్లిములను పూర్తిగా వెలివేశారు. ప్రవక్తశ్రీ (స) తన వంశం వారితోనూ, తన సహచరులతోనూ "షిఅబె అబీ తాలిబ్"★లో బందీగా ఉండేవారు, కురైష్ ప్రజలు అన్ని వైపుల నుండి ఆ వీధిని ఆంక్షలకు గురి చేశారు. దాన్ని దాటి ఎటువంటి ఆహార పదార్థాలూ లోనికి చేరజాలవు. కేవలం హజ్జ్ కాలంలో ఈ బందీలు బయటికి వచ్చి ఏమయినా కొనుగోలు చేసుకోగలిగేవారు. కాని అబూ లహబ్, వారిలో ఎవరయినా బజారు వైపునకు వెడుతూ ఉండగా, లేదా ఏదయినా వ్యాపార బిడారు వైపునకు వెళ్ళగా చూస్తే, వ్యాపారులకు గట్టిగా చెప్పేవాడు, వీరు ఏది కొనాలన్నా వాటి ధరలు వీరు కొనలేనంత అధికంగా చెప్పండని, తరువాత ఆ పదార్థాలు మీ నుండి నేను కొంటానని, మీకు నష్టం కలగకుండా చూస్తానని ప్రకటించేవాడు. మూడేళ్ళ కాలం నిరంతరం ఇలా బహిష్కరించడం మూలాన ముస్లిములకు, బనీ హాషిమ్‌కు నడుము విరిగినంత పనయింది. వారికి ఎన్నెన్నో సంక్లిష్ట పరిస్థితులు ఎదురయ్యాయి, ఒక్కోసారి ఆకులలములు, గడ్డిపోచలూ తినవలసిన గతి కూడా పట్టింది.

దైవమా అంటూ అదే సంవత్సరం బహిష్కరణ ఎత్తివేయటం జరిగింది. అప్పుడే ప్రవక్తశ్రీ (స) పెదనాన్న అబూ తాలిబ్, గత పదేళ్ళుగా ఆయన (స)కు డాలుగా నిల్చున్న వ్యక్తి, పరమపదించారు. ఈ దుస్సంఘటన జరిగి ఇంకా ఒక్క నెలయినా గడవక మునుపే ఆయన (స) జీవన సహచరి హజ్రత్ ఖదీజా కూడా పరమపదించారు. ఆవిడ ఉనికే, ప్రవక్తశ్రీకి తన బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి ఇప్పటి వరకు నెమ్మది, ఓదార్పులకు కారణమయి ఉండేది. ఇలా ఒక దాని తరువాత మరొకటి ఆపదలు, విపత్తుల పరంపర వల్ల ప్రవక్తశ్రీ (స) ఆ సంవత్సరాన్ని 'ఆముల్‌హుజ్న్' (దుఃఖం, విషాదాల సంవత్సరం) గా పేర్కొనేవారు.

హజ్రత్ ఖదీజా, అబూ తాలిబ్‌గార్ల నిష్క్రమణ తరువాత మక్కా తిరస్కారులు ప్రవక్త మహనీయుల (స) వ్యతిరేకతలో ఇంకా అధికంగా సాహసోపేతులయ్యారు, మునుపటికన్నా అధికంగా ఆయన్ని ఇబ్బంది పెట్టసాగారు. కడకు ఆయన ఇంటి నుండి వెలుపలికి రావడమూ దుర్భరమయిపోయింది. అదే కాలంలో జరిగిన ఈ సంఘటనను ఇబ్ను హిష్షామ్ పేర్కొన్నారు. ఒక రోజున కురైష్‌లోని రౌడీ మూకలో నుంచి ఒక వ్యక్తి నడి బజారులో ఆయన (స) నెత్తిమీద మట్టిపోశాడు.

**(మిగతా వచ్చే సంచికలో)**

★ *షిఅబె అబీ తాలిబ్, మక్కా పుణ్యపురిలో ఒక వీధి పేరు. అందులో బనీ హాషిమ్ నివసించేవారు. షిఅబ్ అంటే శిఖరమని, (దిబ్బ అని, ఎత్తయిన ప్రదేశమని) అర్థం. ఈ వీధి అబూ కుబైస్ గుట్టల్లో ఒక గుట్టపైన ఉండేది. అబూ తాలిబ్ బనీ హాషిమ్ నాయకులు. అందువల్ల దాన్ని షిఅబే అబీ తాలిబ్ అనేవారు. మక్కా పుణ్యపురిలో, స్థానిక ఉల్లేఖనాల ప్రకారం ప్రవక్త మహనీయుల జనన ప్రదేశంగా ప్రతీతి చెందిన గృహానికి దరిదాపుల్లోనే ఈ గుట్ట ఉండేది. నేడు దాన్ని షిఅబె అలీ లేదా షిఅబె బనీ హాషిమ్ అని అంటున్నారు.*

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా(ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِي

## 4. యుద్ధాల ప్రకరణం -2
(కితాబుల్ మగాజీ)

## హజ్జతుల్ వదా (వీడ్కోలు హజ్జ్)

**258)** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) కథనం: హజ్జతుల్ వదా సందర్భంగా ఖష్అమ్ తెగకు చెందిన ఒక మహిళ దైవ ప్రవక్త(స) సమక్షంలో ఒక ప్రశ్న వేసింది. ఆ సమయంలో ఫజల్ బిన్ అబ్బాస్(రజి) ప్రవక్త వెనుకే వాహనంపై కూర్చుని ఉన్నారు. 'దైవప్రవక్తా! దేవుని ఏ హక్కును దాసులు నెరవేర్చవలసి ఉన్నదో (అంటే హజ్జ్ విధి) అది నా తండ్రిపై కూడా విధితమై ఉంది. కాని ఆయన వృద్ధాప్యం కారణంగా వాహనంపై కూర్చోలేని స్థితిలో ఉన్నారు. మరైతే నేను ఆయన గారి తరపున హజ్జ్ చేయగలనా?' అని ఆ స్త్రీ ప్రశ్నించగా, 'అవును. చేయగలవు' అని ఆయన(స) సమాధానమిచ్చారు.

**259)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు: మక్కా విజయం నాడు ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఏతెంచారు. ఆయన స్వారీ అయివున్న 'ఖస్వా' అనే ఒంటెపై, వెనుక ఉసామా బిన్ జైద్(రజి) కూర్చుని ఉన్నారు. ఆయన (స)తోపాటు బిలాల్, ఉస్మాన్ బిన్ తల్హా కూడా ఉన్నారు. ఆయన(స) కాబా గృహం వద్ద తన ఒంటెను కూర్చోబెట్టి, "కాబా గృహం తాళం చెవులు తీసుకురా" అని ఉస్మాన్ బిన్ తల్హా (రజి)ను ఆదేశించారు. ఆయన తాళం చెవులు తెచ్చి, కాబా గృహ ద్వారం తెరిచారు. దైవప్రవక్త(స) లోపలికి వెళ్ళారు. ఆయన(స)తో పాటు ఉసామా, బిలాల్, ఉస్మాన్‌లు కూడా లోపలికి ప్రవేశించారు. ఆ తరువాత వారు కాబా ద్వారాన్ని లోపలి నుండి మూసివేశారు. చాలా సేపటివరకు వారు లోపలే (ఆరాధనల్లో, వేడుకోళ్ళలో నిమగ్నులై) ఉన్నారు. ఆయన(స) బయటికి రాగానే జనులు కాబా గృహం లోపలికి వెళ్ళడానికి ఎగబడ్డారు. నేను అందరికన్నా ముందు లోనికి ప్రవేశించాను. ఆ క్షణంలో బిలాల్ (రజి) ద్వారం వెనుక నిలబడి ఉండటం గమనించి, 'దైవప్రవక్త(స) నమాజ్ చేసిన స్థలం ఏది?' అని అడిగాను. ఆయన ఆ స్థలం (సైగతో) చూపారు. కాబా గృహానికి లోపల ఆరు స్తంభాలున్నాయి. అవి రెండు వరుసల్లో ఉన్నాయి. ఆయన(స) మొదటి వరుసలోని రెండు స్తంభాల మధ్యన నమాజ్ చేశారు. ఆ సమయంలో కాబా గృహ ద్వారం ఆయన (స) వీపు వెనుక ఉండగా ఆయన ముఖారవిందం ద్వారానికి ఎదురుగా ఉన్న గోడవైపు ఉంది. ఆయన(స) నిలబడిన స్థలానికి– గోడకు మధ్యన మూడు మూరల ఎడం ఉంది. 'దైవప్రవక్త(స) లోపల ఎన్ని రకతుల నమాజ్ చేశారు?' అని బిలాల్‌ని అడగటం తాను మరిచిపోయానని ఇబ్నె ఉమర్(రజి) తెలిపారు. ఆయన(స) నమాజ్ చేసిన స్థలంలో ఎర్రని రంగు గల పాలరాయి పరచబడి ఉంది.

**260)** ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ ఆయిషా(ర.అ) తమతో చెప్పినట్లుగా ఉర్వా బిన్ జుబైర్, అబూ సలమా బిన్ అబ్దుర్రహ్మాన్ ఉటంకించారు: ఆమె ఇలా అన్నారు– హజ్జతుల్ వదా సందర్భంగా ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ సఫియ్యా (ర.అ) బహిష్టు స్థితికి లోనయ్యారు. అప్పుడు దైవప్రవక్త(స), 'ఏమిటి, ఈవిడ మూలంగా మనం ఆగి పోవలసి ఉంటుందా?"[1] అని అడిగారు. దానికి నేను, 'దైవ ప్రవక్తా! ఆమె మక్కాకు చేరుకోగానే 'తవాఫె జియారత్' చేసింది' అని అన్నాను. "అలాగా! అలాగయితే ఆమె కూడా మనతోపాటే బయల్దేరవచ్చు (తవాఫె వదా చేయనవసరం లేదు)" అని దైవప్రవక్త(స) చెప్పారు.

*260-1. ఆమె 'తవాఫె జియారత్' చేయలేదేమోనని భావించి ఆయన(స) అలా అన్నారు.*

అనువాదం - కె.ఎం.ఎ. సుబ్‌హాన్

ఐదవ భాగము

# ఇస్లామీయ ఉద్యమ భవిష్యత్తు

**(సయ్యద్ సాదతుల్లా హుసైనీ పుస్తకం "ఇఖామతె దీన్ కీ షాహ్‌రాహ్" నుంచి....)**

**ఇస్లామీయ ఉద్యమం** కోసం ఒక సుదీర్ఘమైన, ఉన్నతస్థాయి కలిగిన అంశాలను, లక్ష్యాలను, మరింత సుదీర్ఘమైన, ఉన్నతమైన ఆచరణలను గురించి చర్చించడం ఈ వ్యాసం ఉద్దేశ్యం.

ఈ వ్యాసంలో ధర్మసంస్థాపన లక్ష్యసాధన కృషిలో రానున్న రెండు, మూడు దశాబ్దాల కాలానికి అవసరమైన తక్షణ అవసరాలు, ఫలితాలు సాధించబడే Interim goals ను ప్రతిపాదించడం జరిగింది. ఈ వ్యాసంలో ఈ ప్రతిపాదనలను ఒక విజన్ స్టేట్‌మెంట్‌గా ఐదు అంశాలుగా వివరించడం జరిగింది.

ఈ అనుబంధ కార్యాచరణ ప్రతిపాదనలో ధర్మ సంస్థాపనా లక్ష్యం జమాఅత్ కార్యాచరణలో ఫలితాల సాధన (Achievements)లకు ప్రాధాన్యతనివ్వడం జరిగింది. దాంతో పాటు భారతదేశంలో భవిష్యత్ ప్రణాళిక ఎలా ఉండాలి? అనే అంశాన్ని కూడా చర్చించడం జరిగింది.

## భారతదేశ భవిష్యత్తు ఒక చూపులో !

✓ రానున్న కాలంలో మన దేశం అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకోగలుగు తుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రస్తుత చర్చనీయాంశం భారతదేశం చాలా వేగవంతంగా అభివృద్ధి సాధిస్తుంద నేది. అంతర్జాతీయంగా దాని ప్రభావం, పలుకుబడి కూడా అధికమవుతుంది. 2022 వరకు భారతదేశం జనాభా రీత్యా అత్యంత పెద్దదేశంగా గుర్తింపు పొందింది. అంతర్జాతీయంగా ప్రతి ఐదుగురిలో ఒకడు భారతీయుడై ఉంటాడు. ఒక ట్రిలియన్ డాలర్ల జాతీయ ఉత్పత్తితో మన దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచం లోనే అత్యంత వేగంగా పెరుగుతుంది.

(Gross Daniel and Alcidi Cinziz(ed) : The Global Economy in 2020. Trends and Strategies for Europe. Centre for European Policity Studies, Brussels, 2013) ఇంకా, 2030 కల్లా మనదేశం ప్రపంచంలోనే అత్యధిక యువతరం గల యువదేశంగా ఉంటుంది. ఇంకా, అత్యధికంగా శ్రమించే శక్తిగల జనాభాగానూ ఉంటుంది. Working age population మనదేశంలో మెండుగా ఉంటుంది. యూరప్, రష్యా, తదితర దేశాలు వృద్ధ జనాభా కారణంగా, అభివృద్ధి సాధించిన ఆర్థికతత్వపు పెద్దభాగం భారతీయ నిపుణులు, శ్రమ జీవుల ద్వారా నడపబడుతుంది. ఇక అంతర్జాతీయంగా ఇస్లాం పోషించే పాత్ర కూడా భారతదేశం ద్వారా ప్రముఖంగా ప్రపంచ పటంపై ఉంటుంది.

✓ ఈ మధ్యకాలంలో దేశంలో పట్టణ, నగర జనాభాలో విపరీతమైన పెరుగుదల ఉంటుంది. ఆ కాలంలో (అనగా 2014లో) జనాభా రీత్యా అత్యధిక జనం గ్రామీణ ప్రాంతాల్లో ఉండేది. అది నిష్పత్తి రీత్యా డెబ్బైశాతంగా

ఉండింది. రానున్న పాతికేళ్ళలో ఈ గ్రామాల నుండి నగరం వైపునకు వలసల్లో విపరీతమైన పెరుగుదల జరుగుతుంది. కనీసం 50 కోట్ల మంది నగరాల వైపునకు ప్రయాణిస్తారు. అప్పుడు దేశంలోని నగరాలలో జనాభా శాతం 50గా మారుతుంది. (United Nations ; world Urbanization Prospects. The 2014 - Revision. Department of Economic and Social Affairs, U.N.New york - 2014)

- ✓ 2030 నాటికి దేశంలో ఒక కోటి కంటె ఎక్కువ జనాభా గల నగరాలు 7, నలభై లక్షల నుండి ఒక కోటి జనాభా గల పట్టణాలు 6, ఇంకా పది లక్షల కంటె అధిక జనాభా గల పురాలు 25 వరకు ఉంటాయి. ఈ ప్రాంతాలు దేశ ఆర్థిక, విద్య, ఇతర ప్రముఖ అంశాలకు ప్రధాన కేంద్రాలుగా మారుతాయి. దేశానికి డెబ్బై శాతం ఆదాయం ఈ నగరాల నుండి వస్తుంది. ఈ నగరాలు సామాజిక, రాజకీయ అంశాలను సైతం శాసించే కేంద్రాలుగా రూపొందుతాయి.
- ✓ నగర జనాభా పెరుగుదలతో పాటుగా అనేక నాగరిక, సామాజిక, మానసిక సమస్యలు కూడా అధికమవుతాయి. పాశ్చాత్య నాగరికత ప్రభావం, అధికమవుతుంది. దాని ఫలితంగా వ్యక్తి, కుటుంబ జీవితం, ప్రధానంగా ప్రభావిత మవుతుంది. వ్యక్తివాదం, విడాకులు, వంటి కుటుంబ సమస్యలు తీవ్రతరమవుతాయి. బెంగళూరు లాంటి నగరాలలో ముస్లిం సమాజం ఈ ప్రభావానికి ఇప్పటికే గురై ఉంది. రానున్న కాలంలో ఈ స్థితి మరింత తీవ్రంగా ఉంటుంది.
- ✓ ఈ పూర్తికాలంలో మనదేశంలో మధ్యతరగతి ప్రజల్లో విశేషమైన పెరుగుదల జరుగుతుంది. దేశపు 150 కోట్ల జనాభాలో మూడవ వంతు మధ్యతరగతి వర్గంగా ఉంటుంది. ఈ మధ్యతరగతి వర్గం విద్య, వ్యాపారం, కెరియర్ పునాదులపై అత్యంత ప్రధానమైన స్థానం కలిగి ఉంటుంది. నగర మధ్య తరగతి వర్గపు ప్రత్యేకతలన్నీ కలిగి ఉంటుంది.
- ✓ ఈ నగర నాగరికత, మధ్యతరగతి పెరుగుదల అనివార్య ఫలితంగా ప్రజల్లో ఆధ్యాత్మిక దాహం పెరుగుతుంది. శ్రీశ్రీ రవి శంకర్ వంటి యోగులు, బాబాలు, ఇతర ఆధ్యాత్మిక బోధకులు పెరుగుతారు. ఈ క్రమంలో ప్రశాంతత, మానసిక సంతృప్తి, ఆధ్యాత్మిక దాహాన్ని తీర్చే ఇస్లామీయ బోధకులూ తయారవుతారు.
- ✓ దేశ ప్రాధాన్యతలో పెరుగుదల, ఆర్థిక అవసరాలు, విస్తృతమైన మార్కెటు (Continental Market) వగైరాల కారణంగా మన ఇరుగు పొరుగు దేశాలతో ఉన్న విభేదాలు తగ్గే సూచనలున్నాయి. ఇంకా విడిపోయే ఉద్యమాలు సమాప్తమైపోతాయి. కాని దేశ అంతర్గతంలో జాతి, కుల, మత, ప్రాంతీయ విభేదాలు పెరిగే అవకాశాలున్నాయి. (Hindu Business line, Jan- 19 - 2012 FICCI, Deleberates...)
- ✓ వాణిజ్యంలో వచ్చే ఈ పెనుమార్పు, నూతన వ్యాపారా లకు, నూతన పెట్టుబడిదారీ వర్గానికి ద్వారాలు తెరుస్తుంది. నగరీకరణ, నూతన పెట్టుబడిదారీవర్గ ఆవిర్భావం, ఆదా యాలలో పెరుగుదలతోపాటుగా ఆర్థిక అంతరాలు కూడా విపరీతంగా పెరుగుతాయి. వంచితు లైన ప్రజల అధిక సంఖ్య సోషలిస్టు ఉద్యమాలకు మరో సారి నూతన ఊపిరి లూదుతుంది.
- ✓ భవిష్యత్తులో సివిల్ సొసైటీ ప్రాధాన్యత అధికమయ్యే పరిస్థితులు ఏర్పడవచ్చు. ఆర్థిక రంగంలో సోషల్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్, లాభార్జనారహిత సమాజ కార్యక్రమాలు Not for profit ventures పెరుగుతాయి. పాలనా వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థ, మీడియా వ్యవస్థల వరుసలో ఐదవ మూల స్తంభంగా ఈ సివిల్ సొసైటీ ఎదుగు తుంది. ప్రభుత్వ పరిపాలనలో ఈ సివిల్ సొసైటీ ప్రాధాన్యత పెరుగుతుంది. ఈ సివిల్ సొసైటీపై ఆధిపత్యం కోసం వామపక్ష, మితవాదపక్షాల మధ్య రాజకీయ పోరాటమూ తీవ్రమవుతుంది. (Deepika Goswami et, al, Civil Society in changing India. PRIA, New Delhi -2011)
- ✓ ఈ మధ్యకాలంలోనే హిందూత్వ జాత్యాహంకారం తన ఉచ్ఛస్థితికి చేరి దాని పతనం ప్రారంభమవుతుందని భావించవచ్చు. అయితే దాని ప్రభావం వల్ల ముస్లిం సమాజంలో విపరీతమైన నష్టాలు జరుగుతాయి. ముస్లింల ప్రత్యేక గుర్తింపును ఈ ఉద్యమం తుడిచి పెట్టేయాలనే నిరర్థక కృషి చేస్తుంది. ఫలితంగా ముస్లింలు విపరీతమైన నష్టాలకు గురికాక తప్పదు. (Dilute)
- ✓ ఈ హిందూత్వ ఉద్యమం, దాని సిద్ధాంతం ముఖ్యంగా మధ్యతరగతిని ప్రభావితం చేస్తుంది. తాత్వికత, అధికారం, నైతికత, విద్యావ్యవస్థ, వ్యాపార, వాణిజ్యం, సామాజికత, శాస్త్ర విజ్ఞానం లాంటి రంగాలు కూడా విశేషంగా ప్రభావితమవుతాయి. ఇస్లాంపై విమర్శలు, తర్జనభర్జనలు, వాదోపవాదాలు జరుగుతాయి. ఇస్లాంను ప్రజల ముందు చర్చకుపెట్టే అవకాశాలూ పెరుగుతాయి. బహుదైవారాధన

పదార్థపూజ, పాశ్చాత్య నాగరికతలు సవాళ్ళుగా ఇస్లాంను ఎదుర్కొంటాయి. స్వయానా ముస్లింల నుండియే ఈ వాదాలకు ప్రతినిధులు పుట్టుకొని వస్తారు.

✓ రాబోయే కాలంలో ఇస్లాం – పాశ్చాత్య ప్రపంచాల మధ్య ఈ పోరాటం సుదీర్ఘంగా సాగుతుంది. ఈ పోరాటంలో ఇస్లాం వైపునకు ప్రపంచ దృష్టి కూడా మరలుతుంది. ఇస్లాం పట్ల అపోహలు, అపార్థాలు కూడా పెంచబడతాయి. ఇస్లాం ప్రపంచవ్యాప్తంగా వేడిగా, వాడిగా, అత్యవసర అంశంగా చర్చనీయాంశం అవుతుంది. ఈ క్రమంలో అనేక నూతన సమర్ధకులూ ఇస్లాంకు లభిస్తారు. ఇస్లాం పట్ల న్యూట్రల్ వాదులు, మౌనప్రేక్షకులు కూడా తగ్గిపోతారు. రెండే మార్గాలు ఉంటాయి. అయితే ఇస్లాం వ్యతిరేకులు, లేకుంటే ఇస్లాం సమర్ధకులు. ఈ ప్రాపంచిక ముఖచిత్రపు ప్రభావం మన దేశంలో కూడా తీవ్ర పరిణామాలకు, మార్పులకు కారణం అవుతుంది.

✓ 2030 నాటికి ముస్లిం జనాభా 24 కోట్లకు చేరవచ్చు. ఇది దేశ జనాభాలో 12 శాతంగా ఉంటుంది. నగరాల వైపునకు ముస్లింల వలసలు ఇతరుల కంటె ఎక్కువగానూ ఉంటాయి. ముస్లింల 2/3 వంతు జనాభా నగరాలలోనే కేంద్రీకృతం అవుతుంది. ముస్లింల విద్యాశాతం కూడా పెరుగుతుంది. ఆ మేరకు ఉపాధి, ఆర్థిక రంగంలో వారి భాగస్వామ్యమూ పెరుగుతుంది. ఈ రంగంలో ప్రతి ఏడుగురిలో ఒక ముస్లిం ఉంటాడు.

✓ ప్రసార మాధ్యమాల ద్వారా కమ్యూనికేషన్ తీవ్రంగా అభివృద్ధి చెందుతుంది. దాని పరిధి కూడా విస్తృతం అవుతుంది. ఇంటర్నెట్, ప్రాంతీయ భాషల్లో ఉపయోగించబడుతుంది. మొబైల్, ఫేస్‌బుక్, వాట్సాప్‌ల ద్వారా అంతర్జాతీయ సంబంధాలు, స్నేహాలూ పెరుగుతాయి. ఇది నగరాలలోని విద్యావంతుల వర్గం వరకే పరిమితం కాకుండా, ఈ ప్రసార మాధ్యమాలు పౌర సమాజ నెట్‌వర్క్ వరకు చేరుతుంది. ప్రతి ఇంటిలోకి, సరళమైన, ప్రాంతీయ భాషల్లో ఈ సాంకేతిక విజ్ఞానం చేరుకుంటుంది.

## ఇస్లామీయ ఉద్యమ స్థితి

✓ ఇస్లామీయ ఉద్యమలక్ష్యం– ధర్మ సంస్థాపనగా ఉంది. ధర్మ సంస్థాపనకు అర్థం, సంపూర్ణ ధర్మస్థాపన మాత్రమే దాని లక్ష్యం. ఈ ధర్మం మనసును, ఆలోచనలను ప్రభావితం చేస్తుంది. ఫలితంగా వ్యక్తితో పాటుగా సమాజం కూడా మొత్తంగా, దాని ప్రతి సంస్థాగత రంగం కూడా ప్రభావిత పర్చబడాలి. రాజకీయ స్థాయిలో కూడా ధర్మసంస్థాపన మొత్తం ధర్మ సంస్థాపనలో ఒక భాగం మాత్రమే.

✓ ఇస్లామీయ ఉద్యమం (నేడు రాజకీయ ఇస్లాంగా ప్రసిద్ధి అవుతుంది) పట్ల వ్యతిరేక ప్రచారం రానున్న కాలంలో మరింత తీవ్రం అయ్యే అవకాశం వుంది. ఈ వ్యతిరేక వాతావరణ ప్రభావం మనదేశంపై కూడా పడితీరుతుంది. దీని ఫలితాలు ఎలా ఉంటాయి? ఇప్పుడే అంచనా వేయడం సాధ్యం కాదు. ఉద్యమ శత్రువులు మనదేశంలో కూడా సందేశ ప్రచార కార్యక్షేత్ర పరిధిని తగ్గించే, నియంత్రించే ప్రయత్నం తప్పక చేస్తారు.

✓ గత 60, 70 ఏళ్ళ ఉద్యమ ప్రచార ఫలితంగా విద్యావంతుల ఒక మోస్తరు ప్రజా సమూహం ఇస్లామీయ ఉద్యమ సహాయకులుగా మారారు. ఇస్లామీయ ఉద్యమ సామీప్యం ద్వారా ఒక పెద్ద సమూహం నేడు ఇస్లాంను సంపూర్ణ జీవన విధానంగా స్వీకరించింది. సామాన్య ముస్లిం ప్రజానీకం కూడా ఈ విషయాన్ని అంగీకరించడం ప్రారంభమయ్యింది. ఈ చైతన్యం వీరిని సందేశ ప్రచార ఉద్యమం వైపునకు మరల్చింది. ఖుర్‌ఆన్ గ్రంథాన్ని అవగాహనతో చదివేవారుగా మార్చింది. ప్రస్తుతం ఇస్లామీయ ఉద్యమంలోని అనేక రంగాలు, అనేక కోణాల్లో పని చేసే సంస్థలు, వ్యక్తులు మనకు కనిపిస్తున్నారు.

✓ సోదర దేశవాసుల వరకు ఇస్లామీయ విశ్వాస భావనలను అందజేసే అనేక సంఘాలు, సంస్థలు నేడు ఉన్నాయి. ఇస్లామీయ విశ్వాసాన్ని సకారాత్మకంగా స్వీకరించేవారి శాతం కూడా బాగానే పెరిగింది. వామపక్ష శక్తులు ఈ మార్పును రానున్న కాలంలో ఒక ప్రత్యేక సమస్యగా ప్రచారం చేసే అవకాశం ఉంది. ఇస్లాంను నిరోధించేందుకు తమ శాయశక్తులా కృషి చేసేందుకూ పూనుకుంటాయి. హిందూ–ముస్లింల మధ్య విద్వేష ప్రచారం ఉధృతం చేసే ప్రమాదమూ ఉంది. ఫలితంగా సందేశ ప్రచార మార్గంలో అనేక అవరోధాలు కల్పించబడ తాయి. అంతర్జాతీయ శక్తులు కూడా ఈ విద్వేషపు మంట లకు మరింత ఇంధనం అందచేస్తాయి. ఆర్.ఎస్.ఎస్. తన శక్తినంతా ఇస్లామీయ ఉద్యమానికి వ్యతిరేకంగా ధారబోస్తుంది. స్వయంగా ముస్లింలలో కొందరు కూడా అవరోధకులుగా మారవచ్చు. ఇంకా ముస్లింల అవిద్య, ధార్మిక బలహీనత, సామాజిక నిర్బలత్వం కూడా ఉద్యమానికి అవరోధాలు కల్పించే అవకాశమూ ఉంది.

(మిగతా వచ్చే సంచికలో)


‘చరితార్థులు’-2

# మౌలానా హిఫ్జుర్రహ్మాన్ సియోహార్వి

## (1901 -1962)

79






మారుతున్న సామాజిక పరిస్థితుల నేపథ్యంలో మన ముందు తరాలను మరింతగా ప్రగతి పథంలో చూడాలంటే ఆధునిక విద్యా విధానాలను అవలంబించక తప్పదని మనసా వాచా నమ్మటం మాత్రమే కాకుండా తన బిడ్డల విషయంలో ఆచరణాత్మక వైఖరిని అనుసరించిన మౌలానా హిఫ్జుర్రహ్మాన్ సియో హార్వి 1901 జనవరి 10న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం బిజినోర్ జిల్లాలోని సియో హారలో జన్మించారు. ఆయన విద్యాభ్యాసం ప్రముఖ విద్యాసంస్థ దారుల్ ఉలూమ్‌లో సాగింది. ఆ సంస్థ ప్రధానోపాధ్యాయులు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు మౌలానా మహమూదుల్ హసన్ అడుగుజాడల్లో ఆయన నడిచారు. చిన్నవయస్సులో భారత జాతీయ కాంగ్రెస్, జమీఅత్-ఎ-ఉలమా-ఎ-హింద్ లాంటి సంస్థలలో చేరిన మౌలానా హిఫ్జుర్రహ్మాన్ సియోహార్వి 1919 నాటి ఖిలాఫత్-సహాయనిరాకరణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. జాతీయోద్యమంలో భాగమైన పోరాట కార్యక్రమాలన్నిటిలో పాల్గొన్న ఆయన ప్రభుత్వం విధించిన నిషేధాలు-నిర్బంధాలను ఎదుర్కొంటూ తన ప్రత్యేకతను నిల్పుకున్నారు. భారత విభజనను ప్రతిపాదిస్తూ ముస్లింలీగ్ చేసిన తీర్మానాన్ని ఖండించారు. భారత విభజన ఆలోచన ఎంత ప్రమాదకరమో వివరిస్తూ, వేర్పాటువాదానికి వ్యతిరేకంగా ఆయన ఉద్యమించారు. 1942లో జమీఅత్ – ఎ-ఉలమా-ఎ-హింద్ నేతృత్వంలో వేర్పాటు వాదానికి వ్యతిరేకంగా ముస్లిం జన సమూహాలను ఐక్యం చేయడానికి మౌలానా ఎంతగానో కృషి సల్పారు. ఆ సందర్భంగా ముస్లింలీగ్ చేసిన భౌతిక-మానసిక దాడులకు లెక్కచేయకుండా, అన్ని కడగండ్లను భరిస్తూ, అవమానాలను సహిస్తూ హిందూ-ముస్లింల ఐక్యతను కాంక్షిస్తూ, నిఖార్సయిన జాతీయవాదిగా విభజన వాదాన్ని ఎదుర్కొన్నారు. స్వతంత్ర భారత దేశంలో అధికారం అండగా ఉన్నా తనను పలు కష్టాలు-కడగండ్ల పాల్జేసిన వ్యక్తులను, సంస్థలను క్షమించి స్వచ్ఛమైన గాంధేయవాదిగా ఆయన నిలిచారు. 1952లో లోక్ సభకు ఎన్నికయిన ఆయన రెండుసార్లు పార్లమెంటు సభ్యులుగా ప్రజలకు సేవలందించారు. మంచి వక్తగా పేరు గాంచిన ఆయన జాతీయ సమస్యను, ముస్లింల ప్రత్యేక సమస్యలను పార్లమెంటులో ప్రస్తావిస్తూ మంచి ఆచరణాత్మక పరిష్కారాలు సూచించారు. ఆధునిక – శాస్త్ర – సాంకేతిక రంగంలో వెల్లువలా వస్తున్న మార్పులను బట్టి మన విద్యావిధానాలు, వ్యవస్థలు ఉండాలని ప్రబోధించిన మౌలానా తన బిడ్డలకు ఆధునిక సాంకేతిక విద్య గరిపారు. ప్రమాదకర క్యాన్సర్ వ్యాధి బారిన పడి చికిత్సకోసం ఎక్కడకు వెళ్ళినా స్వదేశంలోనే చనిపోవాలన్న ఆకాంక్షను వ్యక్తం చేస్తూ వచ్చిన మౌలానా హిఫ్జుర్రహ్మాన్ సియోహార్వి 1962 ఆగస్టు రెండున ఢిల్లీలో చివరి శ్వాస విడిచారు. ✤




**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త

**సయ్యిద్ నశీర్ అహమ్మద్**

రూపొందించిన ఆల్బమ్

**‘చరితార్థులు’ - 2 (తెలుగు)**

THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం



# తమకు అనుకూలంగా మాట్లాడకపోతే సుప్రీంనే బెదిరిస్తారా?

**- యండి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్**

**ఇటీవల సుప్రీం కోర్టు,** వక్ఫ్ సవరణ చట్టం 2025పై విచారణ సందర్భంలో చేసిన వ్యాఖ్యలపట్ల కొంతమంది అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. భారత దేశంలో సుప్రీం ధర్మాసనం వక్ఫ్ భూముల విషయంలో ఎవరి తరపున నిలుస్తోంది? అన్న సందేహాన్ని బలంగా ప్రచారంలో పెడుతున్నారు. అయితే, ఈ వ్యాఖ్యలపై విస్తృతంగా స్పందించే ముందు, న్యాయ వ్యవస్థ పాత్రను సరైన దృక్పథంతో విశ్లేషించడం అవసరం.

సుప్రీం కోర్టు, భారత రాజ్యాంగానికి తలమానికమైన సంస్థ. దేశంలోని ఏ చట్టమైనా రాజ్యాంగ విరుద్ధమా? ప్రజల హక్కులకు భంగం కలిగిస్తున్నదా? అనే విషయంపై స్పందించడం, తీర్పు చెప్పడం దాని ప్రధాన బాధ్యత. వక్ఫ్ చట్టంపై కోర్టు విచారణలో భాగంగా చేసిన వ్యాఖ్యలు వచ్చిన ప్రశ్నలే కానీ, ఏదేని మత పక్షానికి, రాజకీయ పక్షానికి అనుకూలంగానో ప్రతికూలం గానో చేయబడ్డవి కావు. ఇది ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగం. తుది తీర్పు ఇంకా రావలసి ఉంది. ఎప్పుడో త్రేతాయుగ కాలం నాటి రాముడు అయోధ్యలోనే పుట్టాడు అనడానికి ఆధారాలు ఏవి? అని నిలదీసిన సుప్రీంకోర్టే, తుది తీర్పు ఎలా ఇచ్చిందో మనకు తెలుసు.

ఇటీవలే తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి వ్యవహారంలో సుప్రీం కోర్టు చేసిన ఆక్షేపణలు ఇదే విషయాన్ని మరింత స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన బిల్లులపై గవర్నర్ ఆలస్యంగా స్పందించడాన్ని కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. 'గవర్నర్ రాజ్యాంగాన్ని గౌరవించాలి, ఆయనకు తీర్పు చెప్పే హక్కు లేదు.' అని కోర్టు తేల్చింది. ఇది ఎటువంటి మత, రాజకీయ నేపథ్యం లేకుండా, సూత్రాలకు కట్టుబడి న్యాయం చెప్పే కోర్టు ధోరణికి నిదర్శనం.

'మణిపూర్ విషయంలో కోర్టు చాలా తీవ్రంగా స్పందించింది, కానీ పశ్చిమ బెంగాల్‌లో అటువంటి స్పందన ఎందుకు లేదు?' అని ఇటీవల కొందరు విమర్శలు చేస్తున్నారు. ఇది ఊహాత్మక విమర్శ మాత్రమే. ఆయా రాష్ట్రాల్లో జరిగిన సంఘటనలకు పరస్పరం పోలికే లేదు. మణిపూర్లో జరిగిన ఘోరం, మహిళలపై సామూహిక లైంగికదాడి, నగ్నంగా నడిరోడ్డుపై ఊరేగించడం, సామాజిక అస్థిరత మధ్య సుదీర్ఘ కాలంగా కొనసాగిన అశాంతి – ఇవన్నీ మానవ హక్కుల ఉల్లంఘనకు పరాకాష్ఠ, అత్యంత దారుణ ఉదాహరణలు. సుప్రీం కోర్టు స్పందన కూడా ఆ ఘాతుక స్థాయికి తగినట్టుగానే తీవ్రంగా వ్యక్తమైంది.

పశ్చిమ బెంగాల్‌లో చోటుచేసుకున్న ఎన్నికల హింస, పోలీసు వ్యవస్థ వైఫల్యం వంటి అంశాలు తప్పనిసరిగా పరిశీలించాల్సినవే. కోర్టు ఆ విషయాలను కూడా విచారిస్తోంది. కానీ రెండింటికీ ఒకే స్థాయిలో, ఒకే తీరులో స్పందించాలన్న తర్కం

అర్థరహితం. న్యాయ వ్యవస్థ ప్రతి అంశాన్ని దాని స్వభావం మేరకే పరిశీలిస్తుంది. ఎప్పుడూ ఒకే తీరుగా, ఒకే స్థాయిలో స్పందించదు.

ఎంపీల నుండి, రాజ్యాంగ హెూదా కలిగిన వ్యక్తుల వరకూ న్యాయవ్యవస్థపై విమర్శలు చేయడం, న్యాయమూర్తులపై పరుష పదజాలం ప్రయోగించడం ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదం. భా. జ. పా సీనియర్ పార్లమెంటు సభ్యుడు నిశికాంత్ దూబే సుప్రీంకోర్టు గౌరవ ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నాను పట్టుకొని ఇష్టం వచ్చినట్లు వాగాడు. మరొక బీజేపీ నేత దినేష్ శర్మ, చివరికి ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ కూడా సుప్రీం కోర్టు గౌరవ ప్రధాన న్యాయమూర్తిపై విమర్శలు గుప్పించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇదంతా మౌనంగా గమనిస్తున్న బీజేపీ అధిష్టానం అది వారి వ్యక్తిగతం అని చేతులు దులుపుకుంది. నిజానికి ఇది అంత చిన్న విషయమేం కాదు,

ఈ ధోరణి కోర్టు స్వతంత్రతకూ, దేశ ప్రజల న్యాయ హక్కులకూ శరాఘాతం. విమర్శ చేసినా, విజ్ఞతతో చేయాలి. విషయాన్ని తప్పుదోవ పట్టించే విధంగా ఉండకూడదు. కోర్టును ప్రశ్నించాలంటే రాజ్యాంగం పునాదులను గుర్తు పెట్టుకోవాలి. లేకపోతే, ప్రజాస్వామ్య అంతర్భాగమైన 'న్యాయం' అన్న పదం బలహీనపడుతుంది. విలువను కోల్పోతుంది.

ఇలాంటి విమర్శల వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యం ఏమిటో మరిచి పోతున్నాం. న్యాయవ్యవస్థ ప్రభుత్వాల వైఫల్యాలను ప్రశ్నించ కూడదంటే, ప్రజల రక్షణ విషయంలో కూడా స్పందించవద్దని అర్థమా? మణిపూర్ విషయంలో సుప్రీం కోర్టు స్పందించకపోతే, బాధిత మహిళలకు న్యాయం ఎక్కడి నుంచి లభిస్తుంది? ఇది ఆలోచించాల్సిన విషయం కాదా?

వక్ఫ్ సవరణ చట్టం విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలపై అభ్యంతరం చెప్పేవారు, కోర్టు వ్యాఖ్యలను మతపరమైన కోణంలో చూస్తున్నారు. కానీ, వాస్తవం ఏమిటంటే, ఇది హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ బాధ్యత వంటి ప్రాధాన్యత కలిగిన అంశాలకు సంబంధించిన చర్చ. ఈ నేపథ్యంలో కోర్టు ప్రశ్నలు చాలా సహజమైనవి. అవి మత వ్యతిరేకమైనవి కాదు, పారదర్శకత పట్ల నిబద్ధత మాత్రమే.

రెండు ఉదాహరణలు– 1. వక్ఫ్ సవరణ చట్టం విచారణ 2. గవర్నర్ వ్యవహారం – ఈ రెండింటిలోనూ కోర్టు ఒకే ధోరణిని ప్రదర్శించింది: ఏ పదవిలో ఉన్నా రాజ్యాంగానికి, చట్టానికి సమానంగా కట్టుబడి ఉండాలి.

సుప్రీం కోర్టు వ్యాఖ్యలు అవి ఏ చట్టమైనా, ఏ వ్యక్తిగత పదవైనా– ప్రజాస్వామ్యంలో సమీక్షకు తావిస్తే తప్పు కాదు. కోర్టు తీర్పులను, వ్యాఖ్యలను నిందించే ముందు, వాటిలోని వాస్తవికతను గుర్తించాలి. విమర్శ లకు తోడుగా విశ్లేషణ అవసరం అదే ప్రజా స్వామ్యాన్ని బలపరిచే మార్గం.

న్యాయవ్యవస్థ ప్రశ్నకు అతీతం ఏమీకాదు. విమర్శ ప్రజాస్వామ్య ఆరోగ్యానికి అవసరమే! అయితే అది వివేచనతో, విజ్ఞతతో ఉండాలి. లేకపోతే న్యాయం అన్న భావనే అపహాస్యం పాలయ్యే ప్రమాదం ఉంది. ✤


యువతరానికి
**విప్లవనాదం**
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
**గీటురాయి**
వారపత్రిక

**ఒక వారం చదవండి**
**ప్రతి వారం చదువుతారు !**

**చందా వివరాలు**

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

**ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి**
**గీటురాయి వారపత్రికను**
**తెప్పించుకోవచ్చు.**

బ్యాంక్ అకౌంట్ వివరాలు
**GEETURAI WEEKLY**
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
**A/c. No. 1042789768**
**IFSC Code. CBIN0282407**

**లేదా**

**పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.**

**GEETURAI WEEKLY**
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

# తాగూత్ వ్యవస్థపై తిరగబడిన టీనేజీ కుర్రాడు

ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

**ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) మా వాడు అని యూదులంటారు.**

కాదు, ఆయన మా వాడు అని క్రైస్తవులంటారు.

లేదు, ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) అసలు మా వాడు. అతను మా వంశీయుడు, మాకు ఆదర్శప్రాయం అని అరబ్బు ముష్రిక్కులనేవారు.

కాని-

ఇబ్రాహీమ్ (అ) యదార్థానికి యూదుడూ కాడు, క్రైస్తవుడూ కాడు, ఆయన ఏకాగ్రచిత్తంతో భూమ్యాకాశాల సృష్టికర్త వైపునకు మరలి, ఆయన యందే మనసును లగ్నం చేసిన ఏక దైవారాధకుడని ఖుర్ఆన్ అంటోంది. ఇంకా ఆయన గొప్పతనాన్ని కొనియాడుతూ ఖుర్ఆన్ ఇలా అంటోంది-

## ఆయన ఒక ఉమ్మత్

ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) తనకు తానుగా ఒక 'ఉమ్మత్'.

అందరికీ అనుసరణీయ నాయకుడు. అందరినీ ముందుండి నడిపించేవాడు.

ఆయన తన ఉనికి రీత్యా ఒక వ్యక్తే కావచ్చు.

కాని అనుపమమయిన తన త్యాగాల దృష్ట్యా,

అసాధారణమయిన పోరాటాల రీత్యా,

మొక్కవోని సాహసం దృష్ట్యా,

ఆయన 'ఒక్క మనిషి' కాడు.

ఆయన ఒక్కడే ఒక గొప్ప అకాడమీ,

ఆయన ఒక్కడే ఒక సంస్థ, ఒక వ్యవస్థ.

ఒక సైన్యం.

ఒక మార్గదర్శక నేత.

నాయకత్వానికి (లీడర్షిప్) మూల పురుషుడు.

ఆయన బహుదైవోపాసకులలో చేరినవాడు ఎంతమాత్రం కాడు.

పైగా ఆయన-

దైవానుగ్రహాల పట్ల కృతజ్ఞతా భావంతో జీవించినవాడు.

ఈ ప్రత్యేకతల కారణంగానే,

దేవుడు ఆయన్ని తన కార్యం కొరకు ప్రత్యేకంగా ఎన్నుకున్నాడు.

రుజుమార్గం వైపునకు ఆయనకు మార్గబోధన చేశాడు.

దైవం ఆయనకు ఇహలోకంలోనూ మేలును ప్రసాదించాడు, పరలోకంలోనూ ఆయన సజ్జనుల సరసన ఉంటాడు.

ఇబ్రాహీమ్(అలైహిస్సలామ్) విధానం పట్ల అయిష్టతను వ్యక్తం చేసేవాడెవడుంటాడు- శుద్ధ అవివేకి తప్ప!?

**'నువ్వు ఆత్మ సమర్పణ చేసుకో'** అని లోకేశ్వరుడు ఎప్పుడు ఆదేశించినా, 'సకల లోకాల ప్రభువు సమక్షంలో నన్ను నేను (హృదయ పూర్వకంగా) సమర్పించుకుంటున్నాను' అని

సకారాత్మకంగా స్పందించిన త్యాగధనుడు ఇబ్రాహీమ్(అ).

ఇంతకీ ఇబ్రాహీమ్(అ) ఎవరు? ఎచటివారు? ఎందుచేత ఆయన సమస్త మానవాళికి మార్గదర్శక నేతగా చేయబడ్డారు? ఏ కారణంగా ఆయన ప్రవక్తల పితామహుడు (అబుల్ అంబియా)గా పిలువబడ్డారు?

అదంతా గత చరిత్ర. నాలుగు వేల సంవత్సరాల వెనక్కిపోయి చూస్తే-

## 'ఉర్' నగరంలో...

ఇరాక్ ప్రదేశంలోని 'ఉర్' నగరమది. క్రీ.పూ. 2100 ఏళ్ళ క్రితం ఉర్ నగర జనాభా రెండున్నర లక్షలని అంచనా. అయిదు లక్షలని మరో అభిప్రాయం. అప్పట్లో అది మహా గొప్ప పారిశ్రామిక, వాణిజ్య కేంద్రంగా విరాజిల్లేది. దేశ జనాభాలో అధికాంశం పారిశ్రామిక వేత్తలు, వర్తకులే. ఆ నగర శిథిలాల్లో లభ్యమయిన ఆ కాలపు లేఖనాల ప్రకారం ఆ ప్రజలలో అత్యధికుల జీవన దృక్పథం భౌతికవాద ప్రధానమయినదే. ధనార్జనతోపాటు భోగలాలస వస్తువుల్ని సమకూర్చుకుని, రుచులను ఆస్వాదిస్తూ జీవించటం వారి ప్రధాన జీవిత లక్ష్యం. వడ్డీ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా పరిఢవిల్లేది. ఎంతసేపటికీ డబ్బు డబ్బు డబ్బు. పచ్చి వ్యాపార దృక్కోణం గల జనులు వారు. ప్రతి ఒక్కడూ రెండవవాణ్ణి అనుమానించేవాడు. పరస్పరం వ్యాజ్యాలు వేసుకొని కోర్టులు కచేరీల చుట్టూ తిరిగేవారు. వారిలో చాలామంది దీర్ఘాయుష్షు కోసం, సిరిసంపదల కోసం, వ్యాపార వృద్ధికోసం తమ దేవతలను ప్రార్థించేవారు. ఆ జనాభా మూడు వర్గాలుగా చీలి ఉండేది.

1. **అమీలు :**వీరు అత్యున్నత శ్రేణికి చెందినవారు. పూజారులు, ప్రభుత్వాధికారులు, సైనికాధికారులు ఈ వర్గంలో ఉండేవారు.
2. **మిష్కీనులు:** వీరు వ్యాపారస్థులు, పారిశ్రామికులు, వ్యావసాయకులు.
3. **అర్దూలు :** అంటే బానిసలు.

వీరిలో అగ్ర వర్ణానికి చెందిన 'అమీలు'కు సమాజంలో విశిష్ఠ స్థానముండేది. వీళ్ళ సివిల్, క్రిమినల్ హక్కులు వేరితరులకంటే భిన్నంగా ఉండేవి. వీళ్ళ ధన ప్రాణాలకు ఇతరుల కన్నా అధిక మయిన విలువ ఉండేది.

ఇలాంటి నిమ్నోన్నతల వాతావరణంలో హజ్రత్ ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) కళ్ళు తెరిచారు. 'తల్మూద్'లో ఉన్న వివరాల ప్రకారం ఆయన అమీలు వర్గానికి చెందినవారు. ఆయన తండ్రి ఆజర్ ప్రభుత్వంలో అత్యంత ఉన్నత హెూదా కల వ్యక్తి, విగ్రహాల వ్యాపారి, పురోహితుడు.

## ఆనాటి మందిరాలు, మతాచారాలు

'ఉర్' నగరంలో లభ్యమయిన శిలా లేఖనాల్లో దాదాపు అయిదు వేల దేవతల పేర్లున్నాయి. ఆ రాజ్యంలోని వివిధ పట్టణాలకు వేర్వేరు దేవతలుండేవి. ప్రతి పట్నానికి ఓ రక్షక దేవత ఉండేది. దాన్ని నగర దేవతగా, పట్టణ వేలుపుగా, మహాదేవునిగా, దేవదేవునిగా భావించేవారు. దాని గౌరవ ప్రతిపత్తి ఇతర దేవతల కన్నా అధికం. 'ఉర్' నగర దేవత పేరు 'నన్నార్' (చంద్ర దేవత). దాని మూలంగానే తరువాతి వారు దానిని 'కమరీనా' (చంద్ర నగరి)గా పేర్కొన్నారు. రెండవ మహానగరం 'లర్సా'. అది తరువాతి కాలంలో 'ఉర్'కు ప్రత్యామ్నాయ రాజధానిగా మారింది. ఆ నగర దేవత పేరు 'షమాష్' (సూర్యదేవత). ఈ మహా దేవతలకు లోబడి అనేక చిల్లర దేవతలు ఉండేవి. వాటిని అధికంగా ఆకాశంలోని నక్షత్రాల నుండి, కొన్నింటిని భూమి నుండి ఎన్నుకోవటం జరిగింది. తమ చిన్న చిన్న అవసరాలు ఈ చిల్లర దేవుళ్ళకు సంబంధించినవని జనులు తలపోసేవారు. ఈ భూమ్యాకాశాల దేవతల ఆకారాలను విగ్రహాల రూపంలో తయారు చేసుకొని సకల ఉపాసనా రీతులు వాటి సమక్షంలోనే ఆచరించేవారు.

## నాటి సామాజిక స్థితి

'నన్నార్' విగ్రహం 'ఉర్' నగరంలో అన్నింటికన్నా ఎత్తయిన పర్వతంపై వైభవోపేతమయిన కట్టడంలో ప్రతిష్ఠించబడి ఉండేది. దాని సమీపంలోనే నన్నార్ భార్య 'నన్‌కల్' మందిరముండేది. నన్నార్ దేవాలయం ఓ రాజ ప్రాసాదంలా ఉండేది. దాని శయనాగారంలో ప్రతి రోజూ రాత్రి ఒక పూజారిణి వెళ్ళి ఆ దేవతకు వధువుగా తన్ను తాను అర్పించుకునేది. ఆ ఆలయంలో అనేక మంది స్త్రీలు దేవుని పేరిట ప్రత్యేకించబడి ఉండేవారు. వారు దేవదాసీలు (Religious Prostitutes)లా వ్యవహరించేవారు. తన కన్యాత్వాన్ని 'దేవుని' పేరిట అర్పించుకునే స్త్రీ మర్యాదస్తురాలిగా, గౌరవనీయమైనదిగా పరిగణించబడేది. కనీసం ఒక్క మారయినా తనను 'దైవమార్గం'లో ఒక కొత్తవానికి అర్పించుకోవటం స్త్రీకి మోక్ష సాధనమని తలపోసేవారు. ఇక ఈ మతపరమయిన వ్యభిచారిణుల ద్వారా సుఖాలననుభవించేవారు అత్యధికంగా పూజారులేనన్న సంగతి వేరుగా చెప్పనవసరం లేదు.

## నన్నార్ స్థానం

'నన్నార్' కేవలం దేవత మాత్రమే కాదు, దేశంలో అందరినీ మించిన భూస్వామి, అందరికంటే గొప్ప వాణిజ్యవేత్త. మహా కర్మాగార యజమాని. దేశ రాజకీయ వ్యవస్థలో అందరికన్నా గొప్ప రాజకీయాధికారం గల శక్తి కూడా నన్నార్‌దే. అసంఖ్యాక

మయిన తోటలు, ఇండ్లు, భూములు ఆ ఆలయానికి అర్పించ బడి ఉండేవి. ఆ ఆస్తుల రాబడితోపాటు కర్షకులు, భూస్వాములు, వ్యాపారస్థులు- అందరూ సకల ధాన్యాలు, పాలు, బంగారం, వస్త్రాలు, ఇతర వస్తుసామగ్రి తెచ్చి ఆలయానికి అర్పించు కునేవారు. వాటిని వసూలు చేయడానికి ఆలయంలో భారీ ఎత్తున సిబ్బంది ఉండేది. అనేక ఫ్యాక్టరీలు ఆలయ యాజ మాన్యం ఆధ్వర్యంలో నడపబడేవి. పెద్దఎత్తున వాణిజ్య కార్య కలాపాలు కూడా ఆలయం తరపున సాగించబడేవి. ఈ కార్యకలా పాలన్నింటినీ దేవతల ప్రతినిధులుగా పూజారులే నిర్వహించే వారు. దేశంలోని అత్యున్నత న్యాయస్థానం కూడా ఆలయంలోనే ఉండేది. పూజారులే దాని న్యాయమూర్తులు. వారు చేసే తీర్పులు దేవుని తీర్పులుగా చెలామణీ అయ్యేవి. స్వయానా రాజవంశానికి చెందిన అధికారం కూడా 'నన్నార్' దేవత తరపున సంక్రమించినదే. అసలు ప్రభువు నన్నార్ అయితే, దేశ పరిపాల కుడు ఆ దేవత తరపున పరిపాలన సాగించేవాడన్న మాట! ఈ 'సంబంధం' కారణంగా రాజు కూడా ఆరాధ్యుడైపోయేవాడు. ప్రజలు అతన్ని కూడా దేవతలకు మాదిరిగానే పూజించేవారు.

## నమ్రూద్

హజ్రత్ ఇబ్రాహీమ్(అలైహిస్సలామ్) కాలంలో 'ఉర్'ను పరిపాలిం చిన రాజ వంశానికి చెందిన తొలి పాలకుడి పేరు 'ఉర్ నమ్ము'. ఇతను క్రీ.పూ. 2300లో ఒక సువిశాల రాజ్యాన్ని స్థాపించాడు. దాని రాజ్య సరిహద్దులు తూర్పున 'సూస' నుండి పశ్చిమాన 'లెబనాన్' వరకు విస్తరించి ఉండేవి. ఇతని వల్లనే ఆ కుటుంబా నికి 'నమ్ము' అన్న పేరు వచ్చింది. అది కాస్తా అరబీలో 'నిమ్రూద్' (Nimrud) గా మారింది.

ఇప్పటి వరకూ బయల్పడిన పురావస్తు పరిశోధనల ఫలితాలు నిజమైనట్లయితే వీటి ద్వారా ఒక విషయం తేటతెల్లమవుతోంది- హజ్రత్ ఇబ్రాహీమ్(అ) జాతిలో బహు దైవారాధన కేవలం ఒక మతపరమయిన విశ్వాసం, ఆరాధన మాత్రమే కాదు, వాస్తవానికి ఆ జాతి ఆర్థిక, నాగరిక, రాజకీయ, సామాజిక జీవన వ్యవస్థ యావత్తు ఆ నమ్మకం ఆధారంగానే రూపొందింది. అదే సమ యంలో హజ్రత్ ఇబ్రాహీమ్(అ) తెచ్చిన తౌహీద్ (దేవుని ఏకత్వపు) సందేశ ప్రభావం కూడా కేవలం విగ్రహారాధన వరకే పరిమితం కాలేదు. రాజకుటుంబం, ఆరాధ్య కుటుంబం, ప్రభు సత్తా గల కుటుంబం అన్న భావనలు కూడా దానికి తప్పక గురవుతాయి. పూజారులు, అగ్రవర్ణాల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతు లతోపాటు రాజ్యంలోని సామూహిక జీవన వ్యవస్థలన్నీ తీవ్రంగా ప్రభావితమవుతాయి. ఇబ్రాహీమ్(అ) సందేశాన్ని స్వీకరించట మంటే సమాజపు కట్టడాన్ని పైనుంచి క్రిందివరకు కూలదోసి, దేవుని ఏకత్వం ప్రాతిపదికగా సరికొత్త వ్యవస్థను నిర్మించటమన్న మాట! అందువల్లనే ఇబ్రాహీమ్(అ) ఏక దైవారాధన సందేశం వెలువడగానే సమాజంలోని సామాన్యులు మొదలుకుని అగ్రస్థాయి వారూ, పూజారులు, నమ్రూద్- అందరూ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అందరూ కలసి ఆ సందేశాన్ని అణచివెయ్యడానికి సమాయత్తమయ్యారు.

## ఇబ్రాహీమ్(అ) కలత చెందిన వేళ...

ఇంతకీ హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) తన జాతి వారితో ఏమన్నారు?

రోగగ్రస్తమై ఉన్న ఉర్ సామాజిక వ్యవస్థను చూసి ఆ నూనూగు మీసాల కుర్రవాడు తీవ్ర వ్యాకులతకు లోనయ్యాడు. తమ స్వహస్తాలతో చేసిన విగ్రహాల ముందు ఈ మనుషులు సాగిల పడటం అతనికి వింతగా తోచింది. చూడబోతే ఆ మట్టిబొమ్మలు కదలలేవు. మెదలలేవు. కనులు విప్పి చూడలేవు. పెదవి విప్పి పలకలేవు. అయినప్పటికీ ఈ జనులు తమ అవసరాల కోసం వాటి వద్దకే వెళుతున్నారే! వాటినే మొక్కుకుంటున్నారే!! వాటి ముందే నైవేద్యాలు సమర్పించుకుంటున్నారే!!!

ఆ అబ్బాయి సత్యాన్ని శోధించటంలో నిమగ్నుడయ్యాడు. విశ్వ ప్రభువు అతని పరిశోధనా మార్గాన్ని సుగమం చేశాడు. సత్యాలు ఒకదాని తరువాత ఒకటిగా అతని కళ్ళ ముందుకు రాగాసాయి. అతని దృష్టి సూర్యచంద్ర నక్షత్రాదులపై పడింది. అంతకు ముందు అతను వాటిని చూడలేదని కాదు, చూశాడు. కాని లోగడ చూసిన దృష్టి వేరు. ఇప్పటి దృష్టి వేరు. ఇది యోచనా దృష్టి! పరిశోధనా దృష్టి! కాని కొంత సేపటి తరువాత అవన్నీ అస్తమించేసరికి, అస్తమించేవి నా దైవాలు కాలేవన్న నిర్ధారణకు వచ్చాడు.

ఇక నుంచి తాను అస్తమించని వాని వైపునకు,
ఆదిమధ్యాంత రహితుని వైపునకు
భూమ్యాకాశాల నిర్మాత వైపునకు
ఏకాగ్ర చిత్తంతో అభిముఖుణ్ణి కావాలని కృతనిశ్చయం చేసుకున్నాడు.
తాను బహుదైవారాధకుల కోవకు చెందినవాణ్ణి కానని దృఢంగా నిర్ణయించుకున్నాడు.
బహు దైవారాధన ప్రబలిన సమాజంలో సంబరాలకు, ఉత్స వాలకు, జాతరలకు ఏమాత్రం కొరత ఉండదు. యజ్ఞ యాగా దులు వైభవోపేతంగా జరుగుతుంటాయి. భారీ ఎత్తున అధికార యంత్రాంగం మోహరించబడుతుంది. జాతీయ సంపద మంచి నీరులా విరివిగా ఖర్చు చేయబడుతుంది. ఇబ్రాహీమ్(అ) జాతి ప్రజల పరిస్థితీ ఇదే.

**(మిగతా వచ్చే సంచికలో)**



- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

# ముస్లిమ్ ఆదర్శ దినచర్య

**సూర్యుడు వాలినప్పటి నుండి రాత్రి చీకటిపడే వరకు నమాజ్‌ను స్థాపించు. వేకువజామున కూడా ఖుర్‌ఆన్ పఠనం చేస్తూ ఉండు. వేకువ జామున ఖుర్‌ఆన్ పఠనం (దైవదూతల) సాక్ష్యానికి కారణమవుతుంది.** (బనీ ఇస్రాయీల్: 78-79)

అల్లాహ్ నామ స్మరణ సహజంగానే ఆత్మస్థైర్యాన్ని పెంచుతుంది. మనసుకు నిరంతర ప్రశాంతతనిస్తుంది. దైవారాధన వల్ల ఎన్ని కష్టాలు ఎదురైనా 'పరీక్షలు'గా భావించి ఓపిగ్గా భరించే తత్వం అలవడుతుంది. ఆ దైవమే వాటిని ఎదుర్కొనే ధైర్యాన్ని ఇస్తాడన్న దృఢవిశ్వాసం ఏర్పడుతుంది. దైవం మీద మనసు లగ్నం చేయడం, నమాజు విధానం పట్ల శ్రద్ధ... మనలో ఏకాగ్రతను పెంచుతాయి.

దేవుడి ముందు రుకూ సజ్దా చేయడమంటే మదిలో ధర్మ దీపం వెలిగించడమే. మనలోనూ మన చుట్టూ ఉన్న చీకటిని తరిమి కొట్టడమే! ఆ వెలిగే సత్యజ్యోతికి మరిన్ని జ్యోతులను వెలిగించే శక్తి ఉంటుంది. ఆ స్ఫూర్తితో ఆత్మలోని 'జ్యోతి'ని వెలిగించు కోగలిగితే అదే చైతన్యం. 'ఉపవాసం' అంటే కడుపు మాడ్చుకోవడం కాదు.

ఈనాడు శాంతి ఎందుకు కరువైపోయింది? జీవితాలు ఎందుకు దుర్భరమైపోయాయి? సుఖనిద్రను ఎందుకు కోల్పోయాము? పరస్పర ప్రేమాభిమానాలు ఎందుకు లోపించాయి? అంటే, సమధ్ధానం- మన దినచర్య సరిగా లేకపోవడమే. ప్రతిరోజూ మనం చేసే దినచర్య ఇతరులకు ఆదర్శంగా ఉండాలి. అప్పుడే జీవితంలో లక్ష్యసాధన సులువవుతుంది. అనైతిక చర్యలకు దూరంగా ఉండాలి. ఇదే ఇతరులకు ఆదర్శమవుతుంది. పిల్లల శారీరక మానసిక ఎదుగుదలకు మంచి దినచర్య అలవాటు చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. ఉదయం నిద్రలేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు పిల్లలు ఏ సమయానికి ఏమి చేయాలన్న దాన్ని నిర్ణయించి వారు దాన్ని పాటించేలా చూడాలి. దీనివల్ల పిల్లలకు సమయ పాలన, క్రమశిక్షణ అలవడతాయి.

నేడు ప్రపంచ వ్యాప్తంగా 50కు మించి ముస్లిం దేశాలున్నాయి. 2024 సర్వే ప్రకారం ప్రపంచంలోని ముస్లింల సంఖ్య దాదాపు 200 కోట్లు. 2050 నాటికి ప్రపంచంలోనే అత్యధిక ఫాలోవర్స్ కలిగిన తొలి ధర్మంగా ఇస్లాం అవతరించనుంది. ఇది నిజంగా గర్వకారణమే. కాని దాదాపు కొన్ని శతాబ్దాల పాటు అన్య సంస్కృతుల ప్రభావం వల్లనో, ముస్లీముల ఏమరుపాటు వల్లనో, ముస్లిం సంఘాల అలక్ష్యం వల్లనో, పండితుల అలసత్వం వల్లనో ఇస్లామీయ ఆచార వ్యవహారాలు కాపుదల లేక రూపు చెడిపోయాయి. కడుపు కక్కురితికై కడగండ్లు మెండైనకొద్దీ ముస్లిం సమాజ తేజస్సు క్రమేణా తగ్గుముఖం పట్టడం మొదలయింది. ఫలితంగా ఖుర్‌ఆన్, హదీసుల యెడల ప్రమాణ్యాబుద్ధి తొలగి పోతోంది. గత అల్లాహ్ ప్రవక్తల సత్య గాథలు స్వయంగా మనం చదవడం, మన పిల్లలకు చెప్పడం గగనమైపోతోంది. మన సజ్జన పూర్వీకుల్ని తూర్పారబట్టే తుంటరోళ్ళు రోజురోజుకి అధికమై పోతున్నారు. ఖుర్‌ఆన్, హదీసును సహాబా ఎలా అర్థం చేసుకున్నారో అలా అర్థం చేసుకోకుండా, పరిపక్వత లేని, పునాది రహిత స్వీయ పరిశోధన, స్వీయ వ్యాఖ్యానంతో ఇష్టమొచ్చిన

పెడర్థాలు తీస్తూ, వారు అధర్మ అడుసు, పాపపు పేడ త్రొక్కి తాము త్రోవ తప్పడమేకాక ఇతర అనేక మందిని త్రోవ తప్పిస్తున్నారు.

పొరుగింటి పుల్లకూర రుచి అన్నట్లు నేటి నవ నాగరికత వాన పాములు కొన్ని - జుట్టు, కట్టు, గడ్డం, పరదా విషయంలో ఏదో కనికట్టు చేయాలని ప్రయత్నిస్తున్నారు. జీవితానికి సంబంధించిన అనేక అంగాల్లో, రంగాల్లో స్వధర్మాలు విడిచి పర సంస్కృతిని అవలంబిస్తున్నారు. బుర్ఖా ధరించడం ఛాందసం కొందరు అభ్యుదయ వాదులు దృష్టిలో. ఇక ముస్లిం దినచర్య గురించి ఇలా బురదబుద్ధి ప్రబుద్వాద్ధులు ఎలాంటి అభిప్రాయం కలిగి ఉంటారో వేరే చెప్పనక్కర లేదు.

ఇస్లామీయ సత్య బద్ధ సంస్కృతిని వీడి పాశ్చాత్య దుష్కృతి అనే విపరీతి రివాజు జీర్ణం కావడం 'చేతనే కొందరికిట్టి హైన్యగతి పట్టింది. మన సజ్జ పూర్వీకుల ఆధ్యాత్మిక చింత, సత్య తపన, దివ్యబోధలు, తిరుగులేని వాక్శుద్ధి, అపూర్వ మహిమలు వీరి చెవికి ఇంపుగా తోచవు. ఆ పాశ్చాత్త కంపే వీరికి మహా ఇంపు. కారణం ఏదైనా కావచ్చు. తెలియక చెడేవారు కొందరు, తెలిసినా ప్రమాదవశం చేత చెడేవారు కొందరు, తెలిసీ తెలియని మిడిమిడి జ్ఞానం చేత చెడేవారు కొందరు, చెడిన వారిచే చెరపబడేవారు కొందరు- ఇలా అధిక శాతం మంది ఏదో రకంగా చెడుకి ప్రభావితులయి చెడడం జరుగుతోంది.

జీవితం క్షణభంగురం. అయినా దాన్ని అనుభవించాలి. అందులోని రసమాధుర్యాన్ని ఆస్వాదించాలి. అందుకు తగినట్లు జీవితాన్ని అందంగా మలచుకోగలగాలి. దీన్నే 'జీవనకళ' అంటారు ఆశావాదులు. నేడు చాలామందిలో అది లోపిస్తోంది. దానికి కారణాలు అనేకం. మారుతున్న జీవన శైలి, మితిమీరిన కోరికలు లాంటివి అందులో ప్రధానమైనవి. ఉన్నత లక్ష్యాలను పెట్టుకుని వాటిని సాధించలేకపోయామని కుంగుబాటుకు లోనవడం ఈ రోజుల్లో సర్వసాధారణం అయిపోయింది. లక్ష్యం ఉండటంలో తప్పులేదు. దాన్ని సాకారం చేసుకోవడానికి సరైన ప్రణాళిక లేకపోవడం వల్లనే సమస్యలన్నీ. అవస్థలన్నీ.

ఇంతకు చెప్పవచ్చేదేమంటే అధర్మాన్ని, అసత్య ఆచారాలను, అశ్లీల అలవాట్లను ఆశ్రయించడమంటే మనము నిర్వీర్యులమయి మన వ్యక్తిత్వాన్ని చంపుకోవడం అన్నమాట. పెద్దలు సత్య ధర్మపాలనలో మాత్రమే శ్రేయముందని హెచ్చరించారు. మహాత్ముల మార్గం తూచా తప్పక అనుసరించడం నేటి వారికి శక్యం కాకపోవచ్చు. శక్తివంచన లేకుండా ప్రయత్నించడమైనా మన కనీస ధర్మంగా భావించాలి. త్రోవనున్న వాడు ఎన్నడూ త్రోవ తప్పిపోడు. ఎన్నటికైనా గమ్య స్థానం చేరుతాడు అన్న యదార్థాన్ని గమనించాలి. ఇక ఒక ముస్లింగా మన దినచర్య ఎలా ఉండాలో తెలుసుకుందాం!

## ఫజ్ర్ ప్రార్థనతో మన దినచర్య ప్రారంభమవ్వాలి

సూర్యుడు వాలినప్పటి నుండి రాత్రి పొద్దుపోయే వరకు నమాజ్‌ను స్థాపించు. వేకువ జామున కూడా ఖుర్‌ఆన్ పఠనం చేస్తూ ఉండు. వేకువజాము ఖుర్‌ఆన్ పఠనం (దైవదూతల) సాక్ష్యానికి కారణమవుతుంది. (బనీ ఇస్రాయీల్: 78,79)

మహనీయ ముహమ్మద్ (స) వారు మస్జిద్‌లో జమాఅత్‌తో ఫజ్ర్ నమాజు చేసి సూర్యోదయం వరకు అక్కడే కూర్చొని ఖుర్‌ఆన్ పారాయణం, దైవ స్మరణలో లీనమయ్యేవారు. అప్పుడప్పుడు ఆయన తన సహచరులు చేసే ముచ్చట్లపై చిరునవ్వు చిందించే వారు కూడా. (సహీహ్ ముస్లిం)

వేకువ జామున అనగా సూర్యోదయానికి అయిదు గడియలకు పూర్వమే పడక నుండి లేవాలి. దీనినే ఖుర్‌ఆన్ ఫజ్ర్ అని నామకరణం చేసింది. అది ఉషఃకాంతులు ప్రకృతిలో ప్రసరించే తరుణం. దేహం నుండి కశ్మలం వెలువడి శుభ్రత, ఆరోగ్యం చేకూరే పవిత్ర సమయం. పశుపక్ష్యాది జీవకోటి అంతా ఉల్లాసంతో లేచి కాలకృత్యాలు తీర్చుకొని కళకళలాడుతుండే, తళతళా మెరుస్తుండే శుభ సమయం. మనస్సులోని మాంద్యం జాడ్యం తొలగి, పూర్ణచైతన్యం ప్రాప్తించే పవిత్ర వేళ. అ పవిత్ర ఘడియలలో కిటికీలు మూసుకొని కంబళి ముసుగు తన్ని గుర్రుపెడుతూ నిద్రించడం మంచిది కాదు.

అటువంటి శుభ సమయంలో కాలకృత్యాలు ముగించుకొని పరిశుద్ధులైనవారి పాపాలు ప్రక్షాళించబడతాయి. వారు అల్లాహ్ సంపూర్ణ రక్షణలో ఉంటారు. ఫజ్ర్ నమాజు వదిలేసి సూర్యోదయం అయినా నిద్రిస్తున్న సోమరుల శిరస్సులు పగులగొట్టబడుతూనే ఉన్నట్టు మేరాజ్ సందర్భంగా ప్రవక్త(స) తెలియజేశారు.

హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: మీలో ఎవరయినా పడుకొని ఉన్నప్పుడు షైతాన్ అతని ముచ్చిలిగుంటపై మూడు ముళ్ళు వేస్తాడు. ప్రతి ముడిమీద, "ఇంకా చాలా రాత్రి ఉంది. హాయిగా నిద్రపో" అంటూ మంత్రించి ఊదుతాడు. అలాంటప్పుడు మనిషి గనక నిద్రలేచి అల్లాహ్‌ను స్మరిస్తే (ఆ ముడులలో) ఒక ముడి ఊడి పోతుంది. ఆ తర్వాత అతను వుజూ కూడా చేస్తే రెండో ముడి ఊడి పోతుంది. ఆ తర్వాత అతను నమాజూ చేసుకుంటే ముళ్ళన్నీ ఊడిపోతాయి. దాంతో అతను ఎంతో హుషారుగా, నూతనోత్సాహంతో లేస్తాడు. లేకపోతే నిర్వేద మనసుతో, బద్ధకంగా లేస్తాడు. (బుఖారీ-ముస్లిం)

దీనికి తోడు సూర్యుని ఉషఃకాంతులు సోకనివారికి సమస్త రోగాలకు ఆట పట్టిన మలబద్ధకం అంకురిస్తోంది. అతినిద్ర అతిభుక్తి అలసుల లక్షణాలన్న మాట మరువరాదు. బుద్ధి వికాసంగా ఉండే ఆ సమయంలో విద్యార్థులు చదువుకోవడం

లెక్కలు చేసుకోవడం మంచిది. బుద్ధి సునిశితంగా పని చేయడం చేత ధారణాశక్తి పెరుగుతుంది. పగటిపూట గంట సేపు చదివినా రాని పాఠం పావుగంటకే కంఠస్థమౌతుంది. ఎంతటి చిక్కు-పనుల విషయంలోనైనా ఆలోచిస్తే చక్కని ఉపాయాలు తోస్తాయి. కనుక ఆ సమయంలో ఇంద్రియాలను జోకొట్టి ఇంకా నిద్రిస్తే వాటి పటుత్వాన్ని ప్రకాశాన్ని ఉత్సాహశక్తిని బలాత్కారంగా అణగగొట్టేవాళ్ళం ఔతాము.

హసన్ బస్రీ (రహిమహుల్లాహ్) ఇలా అన్నారు: పొద్దు ఖుద్దుగా చెప్పిన మాట- ఓ ఆదమ్ సంతానమా! నేను మీ జీవితంలో తొంగి చూస్తున్న కొత్త పొద్దు పొడుపుని, నూతన సృష్టిని. నా నుండి ఎంత లాభ పడాలో అంత లాభ పడండి. ఎందుకంటే, నేను ఒకసారి వెళ్లిపోయానంటే, మళ్ళీ ప్రళయం వరకు తిరిగి రాను.

మరో సందర్భంలో ఆయన ఇలా అన్నారు: "ఓ ఆదమ్ సంతానమా! పగలు మీ పాలిట ఓ అపూర్వ అతిథి లాంటిది ... అలాగే రాత్రి కూడా".

ఓ ఆదమ్ సంతానమా! "ఈ రోజు మీ పాలిట ఓ అపూర్వ అతిథి వంటిది. దానిని సత్కర్మలతో బాగా సత్కరించండి. మీరు దానిని విశిష్ట కర్మలతో ఘనంగా గడిపితే అది మిమ్మల్ని ప్రశంసిస్తూ, పొగుడుతూ మీ నుండి సెలవు తీసుకుంటుంది. ఒకవేళ మీరు దానితో చెడుగా వ్యవహరిస్తే అది మిమ్మల్ని తెగుడుతూ, తిడుతూ నిష్క్రమిస్తుంది. మీ రాత్రి కూడా అంతే."

## ఫజ్ర్ సమయంలో పడక నుండి లేవాలి

మితనిద్ర సుఖాన్ని ఆయువును వృద్ధి చేస్తుంది. రాత్రి పెందలకడ నిద్రించడం, వేకువనే లేవడం ఆరోగ్యదాయకం. రాత్రి జాగరణం నిద్రకు చేటు- పగటినిద్ర పనులకు చేటు ఔతుంది. పడక నుండి లేచీ లేవకుండానే కాల్యకృత్యాలు ముగించకుండా ఎన్నడు... ఫోన్ చూడటం, బెడ్ కాఫీ త్రాగటం వంటివి చేయకూడదు... ఇది శీతల దేశీయుల ఆచారం. వారు వెచ్చని పానీయం త్రాగకుండా బయటకొక్క అడుగైనా పెట్ట జాలరు, చలితో శరీరావయవాలు కొంకరలు పోతూంటే నఖశిఖపర్యంతం బూట్లు, సూట్లు, కోట్లు, హేట్లు ధరిస్తారు. మంటలచే చలి బాపుకొంటారు.

ముస్లింగా నిద్ర మేల్కొన్నందుకు 'అల్ హందులిల్లాహిల్లజీ అహ్యానా బఅ'ద మా అమాతనా వ ఇలైహిన్ నుషూర్' (బుఖారి) అని అల్లాహ్‌కు నిండు హృదయంతో కృతజ్ఞతలు తెలియజేసుకొని విశ్వాస స్థితి మనకు లభించినందుకు గర్వించాలి. పడకనుండి లేవకమునుపే ఈ దైనప్రార్థన చేసుకోవాలి. ఓ సర్వలోక ప్రభువా!! నేడు నిద్ర లేచినది మొదలు తిరిగి పండుకొనే వరకు త్రికరణశుద్ధిగా విద్యుక్త ధర్మ కర్మలను మాత్రమే ఆచరించే 'యోగ్యతను శక్తిని మాకు ప్రసాదించుమని వేడుకోవాలి. అహంకారము అణచి పాపదూరునిగా జేయుమని ప్రార్థిస్తూ మోకరిల్లాలి. చలింపని భక్తి తిరుగు లేని శ్రద్ధ దయసేయుమని చేతులెత్తి అడుక్కోవాలి. అల్లాహ్ ఓ దయాకరా! మా తప్పిదాలు బ్రోవరా, మా జీవితాలు మలచరా! అని దీనాతిదీనంగా ప్రాధేయపడాలి.

యాహ్యా ఇబ్న్ ముఆద్ ఇలా అన్నారు: "రాత్రి చాలా పొడవుగా ఉంటుంది, కాబట్టి సోమరిలా నిద్రపోతూ, అకారణంగా జాగారం చేస్తూ వృధా పర్చుకోకండి. పగలు స్పష్టంగా, ప్రకాశవంతంగా ఉంటుంది. కాబట్టి దానిని పాపాలతో మురికి చేయకండి."

మన సజ్జన పూర్వీకుల మాట: "ఒక వ్యక్తి ఉదయం నిద్ర లేచినప్పుడు, అతను నాలుగు పనులు చేయాలని సంకల్పించుకోవాలి: మొదటిది: సర్వశక్తిమంతుడైన అల్లాహ్ విధులను నెరవేర్చడం. రెండవది: సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నిషేధించిన వాటిని పరిత్యజించడం. మూడవది: ఏ విషయంలోనైనా ఎవరితోనైనా వ్యవహారం చేస్తున్నపుడు వారితో న్యాయంగా నడుచుకుంటానని సంకల్పించుకోవాలి. నాల్గవ విషయం: తనకు, తన ప్రత్యర్థికి మధ్య శాంతికి, సంధికి ప్రయత్నించడం." ఇలా గనక చేస్తే నీతిమంతులు, వివేకవంతుల, విజ్ఞుల, విజేతల జాబితాలో చేరే అవకాశం ఉంది.

## నమాజు చేయని వ్యక్తి నమ్మకద్రోహి

మనందరి గొప్ప దాత, విధాత, ప్రభువు అయిన అల్లాహ్ ప్రసాదించినదే మనం తింటున్నాము. ఆయన నేలపైనే నడుస్తున్నాము, ఆయన అనుగ్రహించిన గాలినే పీల్చుకుంటున్నాము, విడ్డూరం ఏమిటంటే ఆయన చట్టాలనే ఉల్లంఘిస్తున్నాము. ఆయన జనాలని ధిక్కరిస్తున్నాము. ప్రతి దానికి భయపడే మనం, ప్రతి చిన్న విషయానికి విలువనిచ్చే మనం అల్లాహ్‌కు భయపడటం లేదు. ఆయన ఆదేశాలకు విలువ ఇవ్వడం లేదు. ఇది ద్రోహం కాకపోతే మరేమిటి చెప్పండి! నమాజ్ చేయని వ్యక్తి తన యజమాని పట్ల ద్రోహానికి పాల్పడుతున్నాడు. ఎందుకంటే, అతను కలిమా షహాదహ్ (విశ్వాస ప్రకటన) చెబుతూనే, తాను అల్లాహ్‌ను మాత్రమే ఆరాధిస్తానని సాక్ష్యమిస్తూనే నమాజు చేయకపోవడం ముమ్మాటికీ నమ్మకద్రోహమే, తిన్నింటి వాసాలు లెక్కబెట్టడమే! ఏరు దాటగానే తెప్పను తగలెయ్యడమే! తల్లిదండ్రుల మాట వినని అప్రయోజకుడు, అసమర్థుడయిన కొడుకును అందరూ తిడతారు. తలా పిడికెడు మన్నెత్తి పోస్తారు కదా! ఇప్పుడు, తన ప్రభువు మాట వినని వ్యక్తిని ఏమనాలో? ఆత్మ విమర్శ చేసుకుని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి, తన నిజమైన శ్రేయోభిలాషికి విధేయత చూపని వ్యక్తి ఇతరులకు ఎలా విధేయత చూపగలడో? ఒక్కసారి ఆలోచించండి!

**(ఇంకా వుంది)**




## ఏడో తరగతి పాఠ్య పుస్తకంలో మొఘల్ చక్రవర్తుల పాఠ్యాంశాల తొలగింపు

కొత్తగా రూపొందించిన ఎన్సీఈఆర్టీ ఏడో తరగతి పాఠ్య పుస్తకంలో మొఘలులు, ఢిల్లీ సుల్తానుల పాలనకు సంబంధించిన రెండు అధ్యాయాలను తొలగించారు. వాటి స్థానంలో మగధులు, మౌర్యులు, శుంగులు, శాతవాహనులు వంటి పురాతన రాజవంశాలకు సంబంధించిన ఛాప్టర్లను ప్రవేశపెట్టారు. ఇంకో విశేషమేమంటే కొత్త పాఠ్య పుస్తకంలో ఇటీవల జరిగిన మహా కుంభమేళా ప్రస్తావన కూడా ఉంది. అంతేకాక పుస్తకంలోని వేర్వేరు అధ్యాయాలలో జనపద (ప్రజలు నివాసం ఏర్పాటు చేసుకున్న ప్రదేశం), సామ్రాజ్ (దేశ పాలకుడు), అధిరాజ (ఫ్యూడల్ పాలకుడు), రాజాధిరాజ (రాజులకు రాజు) వంటి సంస్కృత పదాలు కూడా బాగా కన్పించాయి. ఎన్సీఈఆర్టీ నూతన పాఠ్య పుస్తకంలో గ్రీకులకు సంబంధించి సవివరమైన సెక్షన్లను చేర్చారు. గత సంవత్సరం 3, 6 తరగతులకు కొత్త పాఠ్య పుస్తకాలు ప్రవేశపెట్టిన ఎన్సీఈఆర్టీ ఈ ఏడాది 4, 7 తరగతుల పుస్తకాలు మార్చింది. ఏడో తరగతి పాఠ్య పుస్తకంలో గతంలో మొఘలులు, ఢిల్లీ సుల్తానులపై సెక్షన్లు ఉండేవి. మొఘలు చక్రవర్తుల విజయాలతో పాటు పలు రాజకుటుంబాల ప్రస్తావనలతో రెండు పేజీల పట్టిక ఉండేది. తాజాగా రూపొందించిన కొత్త సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తకంలో వాటన్నింటినీ తొలగించి వాటి స్థానంలో అనేక కొత్త అధ్యాయాలను చేర్చారు. కానీ ఎక్కడా మొఘలులు, ఢిల్లీ సుల్తానుల ప్రస్తావన లేదు.

## తెలుగు రాష్ట్రాల్లో వక్ఫ్ ఆస్తులు ఎన్నంటే..?

దేశంలో వక్ఫ్(సవరణ) చట్టం- 2025 ఇటీవల అమల్లోకి వచ్చింది. విపక్షాల అభ్యంతరాలను తోసిరాజని ఈ సవరణ బిల్లును పార్లమెంట్ ఉభయ సభల్లో కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. తర్వాత రాష్ట్రపతి ఆమోదంతో ఈ బిల్లు అమల్లోకి వచ్చింది. అయితే వక్ఫ్ (సవరణ) చట్టాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా పలు పార్టీలతో పాటు మైనారిటీ సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నాయి. మరోవైపు ఈ చట్టం చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం విచారణ జరుపుతోంది. ఈ నేపథ్యంలో ఏయే రాష్ట్రాల్లో వక్ఫ్ ఆస్తులు ఎన్నున్నాయో వాటిపై కేంద్రం తాజాగా ప్రకటన చేసింది. దేశంలో వక్ఫ్ ఆస్తులు అత్యధికంగా ఉత్తరప్రదేశ్లో ఉన్నాయని కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ వెల్లడించింది. తర్వాతి స్థానాల్లో పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాలున్నాయని తెలిపింది. దేశంలో వక్ఫ్కు సంబంధించి 8,72,352 స్థిరాస్తులు, 16,713 చరాస్తులు ఉన్నాయని ప్రకటించింది. అలాగే ఇప్పటివరకు 994 వక్ఫ్ ఆస్తులను ఇతర అవసరాలకు కేటాయించినట్లు వివరించింది. ఉత్తరప్రదేశ్లో సున్నీల స్థిరాస్తులు 2,17,161, షియాల స్థిరాస్తులు 15,386 ఉన్నాయని కేంద్రం వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్లో 14,685 స్థిరాస్తులు, 85 చరాస్తులున్నట్లు తెలిపింది. తెలంగాణలో 45,682 స్థిరాస్తులు ఉన్నట్టు ప్రకటించింది.

## మీ చట్టాలను మీరే అమలు చేయరా?

రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్యం అందించే విషయంలో సొంత చట్టాలను అమలు చేయరా అని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఇటీవల నిలదీసింది. రోడ్డు ప్రమాద బాధితులకు ప్రమాదం జరిగిన గంటలోపే నగదు రహిత వైద్యం అందించడంలో కేంద్రం చేస్తున్న జాప్యానికి కారణమేంటని ప్రశ్నించింది. మోటార్ వాహనాల చట్టంలోని 164ఎ సెక్షన్ ఏప్రిల్ 1, 2022న అమల్లోకి వచ్చిందని.. అయినా కేంద్రం బాధితులకు నగదు రహిత వైద్య పథకాన్ని ఎందుకు అమలు చేయడం లేదని అడిగింది. కేంద్రం పెద్దయెత్తున హైవేలను నిర్మిస్తున్నదని.. కానీ వాటిపై సౌకర్యాలు లేక ఆ రోడ్లపైనే ప్రమాదాల్లో ప్రజలు చనిపోతున్నారని ధర్మాసనం ఆవేదన వ్యక్తం చేసింది. వారంలోగా చట్టాన్ని అమలు చేస్తామన్న కేంద్రం మాటలను రికార్డ్ చేసింది.

## ఉగ్రదాడిని ఖండిస్తూ ముస్లింల నిరసనలు

పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ముస్లింలు శుక్రవారం ప్రార్థనల అనంతరం ప్రదర్శనలు చేపట్టారు. చేతికి నల్లరంగు బ్యాండ్లు ధరించి నిరసన తెలిపారు. పాకిస్థాన్కు, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తాజా దాడి నేపథ్యంలో పాక్పై దౌత్యపరంగా, సైనికపరంగా కఠిన చర్యలకు ఉపక్రమించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మరోవైపు- పహల్గాంలో దాడికి పాల్పడిన వ్యక్తులు తమను తాము ముస్లింలుగా చెప్పుకొంటున్నప్పటికీ.. వారి చర్య ఇస్లామ్ మతానికి పూర్తి విరుద్ధమైనదని దిల్లీలోని చారిత్రక జామా మసీద్ షాహీ ఇమామ్ సయ్యద్ అహ్మద్ బుఖారీ వ్యాఖ్యానించారు. ఇటు తెలుగు రాష్ట్రాల్లోనూ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ ముస్లిములు నిరసనలు, ర్యాలీలు నిర్వహించారు.




## ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన అరబ్ దేశాలు

జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రమూకలు 26 మంది పర్యాటకులను పొట్టనబెట్టుకున్న ఉదంతాన్ని ఇరాక్, జోర్డాన్, ఖతర్ తదితర అరబ్ దేశాలు తీవ్రంగా ఖండించాయి. భారత్‌కు సంఘీభావం ప్రకటించిన ఈ దేశాలు, మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించాయి. యూరప్ దేశాల సమాఖ్య ఈయూ కూడా ఈ దారుణాన్ని ఖండించింది. భారత్‌కు సంఘీభావం తెలిపింది. లక్ష్యమేదైనా, ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అందరూ ఖండించాల్సిందేనని స్పష్టం చేసింది. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. దేశ భద్రత, స్థిరత్వానికి భంగం కలిగించే ఇటువంటి శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొంది. అదేవిధంగా, పహల్గాం దాడి నేపథ్యంలో ప్రధాని మోదీకి ఇటలీ ప్రధానమంత్రి మెలోనీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ ఫోన్ చేసి మాట్లాడారు. మృతుల కుటుంబాలకు వారు సానుభూతి తెలిపారు. అమాయకులను దారుణంగా పొట్టనబెట్టుకున్న ఉగ్రమూకల పైశాచికాన్ని వారు తీవ్రంగా ఖండించారు. మెలోనీ, మాక్రాన్లకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారని, దాడికి కారకులైన వారిని చట్టం ముందు నిలబెడతామని చెప్పారని విదేశాంగ శాఖ తెలిపింది.

## గాజాలో డయాలసిస్ రోగుల అవస్థలు

గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దిగ్బంధనం కారణంగా ఆహార పదార్థాలు, ఔషధాలు, ఇతర నిత్యావసరాలు అందక ప్రజలు అల్లాడిపోతున్నారు. దీనికితోడు మందులు, ఇతర అత్యవసర వైద్య చికిత్సలు అందక రోగులు వందల సంఖ్యలో మృత్యువాతన పడుతున్నారు. వారానికి నాలుగుసార్లు డయాలసిస్‌పై ఆధారపడి రోజులు వెళ్లదీసే రోగుల అవస్థలు ఇక చెప్పనక్కరలేదు. మార్చి ప్రారంభం నుండి ఇప్పటివరకు 11మంది రోగులు సకాలంలో వైద్యం అందక మరణించారు. కిడ్నీలు విఫలమై 417మంది మరణించారని అల్ షిఫా ఆస్పత్రిలో డయాలసిస్ విభాగ అధిపతి డాక్టర్ ఘజీ చెప్పారు. మొత్తంగా యుద్ధం ప్రారంభమైన తర్వాత 1100మందికి పైగా రోగులు మృత్యువాతన పడ్డారు. గాజా వ్యాప్తంగా ఆస్పత్రులన్నీ దాడుల్లో ధ్వంసం కావడంతో డయాలసిస్ కోసం వారంలో రెండుసార్లు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులున్నాయి. లేనిపక్షంలో శరీరమంతా ఉబ్బిపోయి, విషపూరితమయ్యే దారుణ పరిస్థితులను ఎదుర్కొంటున్నారని, ఒక్కోసారి అవి మరణానికి దారి తీస్తున్నాయని డాక్టర్ ఘజీ చెప్పారు. నగరానికి పశ్చిమాన గల తాత్కాలిక శిబిరాల నుండి ఉత్తర ప్రాంతంలోని షిఫా అస్పత్రికి వెళ్లడమంటే వారికి అత్యంత ఇబ్బందికరంగా మారుతోంది. 54 ఏళ్ల మహ్మద్ అతియా దాదాపు 15ఏళ్ల నుండి కిడ్నీ వైఫల్యంతో బాధపడుతూ డయాలిసిస్‌పై జీవిస్తూ, వీల్ ఛైర్‌కే పరిమితమయ్యారు. రోగికి వారానికి కనీసం మూడుసార్లు డయాలసిస్ అవసరం, ప్రతీసారి నాలుగు గంటలు చొప్పున ఈ ప్రక్రియ వుంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో రెండు సార్లు మాత్రమే చేయడానికి సాధ్యమవుతోందని, అది కూడా రెండు నుండి మూడు గంటల్లోనే ముగించాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా నెలకొన్న దుర్భర పరిస్థితుల్లో సరైన సరఫరాలు, సదుపాయాలు లోపించడంతో తన రక్తంలోని వ్యర్థాలను పూర్తిగా తొలగించుకోలేని పరిస్థితి నెలకొందని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత దిగ్బంధన చర్యలపై వ్యాఖ్యానించడానికి ఇజ్రాయిల్ మిలటరీ సంస్థ ఇన్‌చార్జి సిఓజిఎటి (కోఆర్డినేషన్ ఆఫ్ గవర్నమెంట్ యాక్టివిటీస్ ఇన్ ది టెరిటరీస్) నిరాకరించారు. గాజా లోపలకు ప్రవేశించడానికి అనుమతులు లేక టన్నుల కొద్దీ మందులు, ఇతర వైద్య పరికరాలు, సామగ్రి గాజా సరిహద్దుల్లో పడివున్నాయి. యుద్ధంతో గాజాలో మొత్తంగా ఆరోగ్య వ్యవస్థ ఛిన్నాభిన్నమైంది.

## హజ్ వీసా ఉంటేనే మక్కాలోకి అనుమతి

ఈ ఏడాది హజ్ యాత్ర ప్రారంభం కానున్న నేపథ్యంలో మక్కా నగరంలోకి విదేశీయుల ప్రవేశంపై సౌదీ అరేబియా ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేసింది. ఈ నెల 23 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త నిబంధనల మేరకు హజ్ పర్మిట్ లేకుండా ఏ ఒక్క విదేశీయుడినీ మక్కా నగరంలోకి అనుమతించబోమని సౌదీ అధికారులు తెలిపారు. ఈ నిబంధనలను అతిక్రమించి వచ్చే విదేశీయులు భారీ జరిమానా, జైలుశిక్ష, దేశ బహిష్కరణను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈనెల 29 నుంచి నిబంధనలు మరింత కఠినతరం కానున్నాయని, హజ్ వీసా ఉన్నవారిని మాత్రమే మక్కా నగరంలోకి అనుమతిస్తామని తెలిపారు. హజ్‌యాత్రలో అనధికారిక రద్దీని నివారించేందుకు భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ సహా 14 దేశాల పౌరులకు వీసా నిబంధనల్లో మార్పులు చేస్తున్నామని ఈ ఏడాది ప్రారంభంలోనే సౌదీ ప్రభుత్వం ప్రకటించింది. ఆయా దేశాల పౌరులకు ఇకపై సింగిల్ ఎంట్రీ వీసాలను మాత్రమే మంజూరు చేస్తామని స్పష్టం చేసింది.

# సత్సంకల్పంతోనే సాఫల్యం

అర్షియా

ఏ పనికైనా సంకల్ప శుద్ధి అవసరం. మన ఆచరణలు సంకల్పాల పైనే ఆధారపడి ఉంటాయని, సంకల్పానికి అనుగుణంగానే ప్రతిఫలం లభిస్తుందని ప్రవక్త ప్రవచనం సూచిస్తుంది. మనిషి మంచి సంకల్పాన్ని, ఉద్దేశాన్ని బట్టి అతడికి అల్లాహ్ మంచి చేస్తాడు. చెడు సంకల్పం అయితే చెడు ఫలితమే లభిస్తుంది. అందుకే ఏ పని చేసినా అల్లాహ్ ప్రసన్నతను దృష్టిలో పెట్టుకొని చేయాలి. మన అంతరంగాన్ని ఎల్లవేళలా అల్లాహ్ గమనిస్తున్నాడనే విషయాన్ని గుర్తుంచుకొని మనం చేసే కార్యాలు ఉండాలి. మనసా, వాచా, కర్మణా మంచి పనులను సత్ సంకల్పంతో చేయాలి. సంకల్పాన్ని పాడు చేసే విషయాల నుంచి మన అంతరంగాన్ని కాపాడుకోవడం అందరికీ అత్యవసరం. భార్యా పిల్లల సేవ కన్నా తల్లిదండ్రుల సేవకు ఎక్కువ ప్రాధాన్య మివ్వాలి. కార్మికుల పట్ల మర్యాదగా వ్యవహరించాలి. మనిషి సంకల్పం సవ్యంగా ఉంటే అతను భార్య, పిల్లలపై చేసే ఖర్చుకు కూడా పుణ్య ఫలాన్ని పొందుతాడు. దైవ మార్గంలో ధనాన్ని ఖర్చు చేసేటప్పుడు సన్నిహిత బంధువులకు ఎక్కువ ప్రాధాన్యమివ్వాలి. ఒక వ్యక్తి మంచి పని చేయాలని సంకల్పించుకొని... ఆ పని చేయలేకపోయినా.. అతడికి ఆ మంచి పని చేసిన పుణ్య ఫలం దక్కుతుంది. మంచి సంక్పలతో తమ బాధ్యతలు నెరవేర్చిన వారికే అల్లాహ్ స్వర్గ లోక ప్రవేశం కల్పిస్తాడు.

## చిత్తశుద్ధితో పశ్చాతాపం చెందాలి

జరిగిపోయిన ప్రతి పాపానికి మనిషి పశ్చాతాపం చెందాలి. ఆ పాపానికి పూర్తిగా స్వస్తి పలకాలి. దానిపై సిగ్గుతో కుమిలిపోవాలి. ఇందులో ఏది లోపించినా ఆ పశ్చాతాపం సరైంది కాదు. చిత్త శుద్ధితో పశ్చాత్తాపం చెందితే, వారు పరమ దుర్మార్గులైనా క్షమకు అర్హులవుతారు. ముస్లింలు సర్వ కాల సర్వావస్థల్లోనూ సత్యమే పలకాలి. సత్యంతోనే దైవ ప్రసన్నత లభిస్తుందని గ్రహించాలి. కపట ధోరణి ఉండకూడదు. చేసిన పాపాలను మన్నించమని వేడుకోవడం కూడా దైవానుగ్రహమే. ఒకవేళ జరిగిన పాపం తోటివారి హక్కులకు సంబంధించినది అయితే దైవ సన్నిధిలో పశ్చాత్తాపాన్ని కోరాలి. వీలైనంత ఎక్కువగా పాపాలపై పశ్చాత్తాప పడుతూ ఉండాలి. దాసుల పశ్చాతాపం పట్ల అల్లాహ్ కూడా సంతోషిస్తాడు. అసంకల్పితంగా జరిగే పొరబాట్లకు శిక్షలు ఉండవు. చేసిన వాగ్దానాలను నెరవేరిస్తే పశ్చాత్తాపం చెందాల్సిన అవసరం ఉండదు. ధర్మ మార్గంలో ఎదురయ్యే కష్టాలను ధైర్యంగా ఎదుర్కోవాలి. మనిషి మంచి వారిని అభిమానించాలి. అలా చేస్తే అతడూ ప్రళయ దినాన సజ్జనుడిగా పరిగణింపబడతాడు. అయితే తీవ్రమైన పాపాలు చేసిన వారికి ఇహ, పర లోకాల్లో కఠిన శిక్షలు ఉంటాయని గుర్తుంచుకోవాలి. పేరాశ, ధనం పట్ల వ్యామోహంతో పాపాలు చేస్తే అందుకు తగిన శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. అంతిమంగా పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చిత్తం లేదని తెలుసుకోవాలి. తెలిసో, తెలియకో చేసిన తప్పును, పాపాన్ని మళ్లీ మళ్లీ చేయకూడదు.

## మనసుంటే మంచి పనులతో పుణ్యమెంతో!

మనిషి ఆరోగ్యంగా ఉన్నప్పుడు చేసే దాన ధర్మాలే నిజమైనవి. మంచి పనులు చేయాలని భావించి దానికి కట్టుబడి ఉండాలి. తన శక్తి మేరకు దైవ మార్గంలో ధనాన్ని ఖర్చు పెట్టాలి, దానాలు చేయాలి. మంచి పనులు చేస్తూ చనిపోతే తగినంత పుణ్య ఫలం వస్తుంది. అయితే జీవితమంతా మంచి పనులు, దానాలు చేయ కుండా కేవలం ముసలితనంలో,స్త్రతీవట5తీట మరణ దశలో చేయడం సత్ఫలితాలను ఇవ్వవు. అల్లాహ్‌ను విశ్వసించి, ఆయన మార్గంలో పోరాడటం, దానం చేయడం ఉత్తమమైన సత్కార్యం. పని రాని వాళ్లకి పని చేసి పెట్టడం, పని చేసే వాళ్లకి సాయపడటం కూడా పుణ్య ఫలితాన్ని కలిగించేదే. ప్రతి తస్బీహ్ పలుకు ఒక సత్కార్యమే. అల్లాహ్‌ను కీర్తించడం, మంచిని ఆదేశించడం కూడా మంచి పనులే. ధర్మ మార్గంలో మనో వాంఛలు, లైంగిక కోరికలు తీర్చుకోవడమూ పుణ్య కార్యాల కిందకే వస్తాయి. సాటి వారిని నవ్వుతూ పలకరించమూ సత్కార్యమే. ఇతరులను మాటలతో కాని, చేతలతో కాని హింసించకుండా ఉండటం కూడా మంచి పనే. ఇతరుల కోసం, భావి తరాల కోసం పండ్ల చెట్లను నాటడం ఎంతో మంచి కార్యం. కష్టపడి చేసిన సత్కార్యానికి పుణ్య ఫలం ఎక్కువగా ఉంటుంది. మన వద్ద ఉన్న గుక్కెడు మేక పాలతో ఇతరుల ఆకలి తీర్చినా పుణ్య ప్రదమే. మంచి మనస్సుతో ఒక్క ఖర్జూరపు ముక్క దానం చేసినా మనం నరకాగ్ని నుంచి కాపాడుకోవచ్చు. భూత దయ కలిగి ఉండటం, నలుగురు నడిచే బాటను శుభ్రం చేయడం, నమాజు కోసం మసీదు వైపు వేసే అడుగులు, ఇతరుల తగాదా పరిష్కరించడమూ మంచి పనుల ఖాతాలోకే వస్తాయి.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**